# వన్ నేషన్.. వన్ ఎలక్షన్

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో సంచలనం నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు వన్ నేషన్.. వన్ ఎలక్షన్ డ్రాఫ్ట్ బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇప్పటికే జమిలీ ఎన్నికల పై రామ్‌నాథ్ కోవింగ్ కమిటీ సిఫార్సులకు ఆమోదం తెలిపిన కేంద్రం తాజాగా జమిలి ఎన్నికల బిల్లుకు కేబినెట్‌లో ఆమోద ముద్ర వేశారు. మార్చి 14న మొత్తం 18,629 పేజీలతో జమిలీ ఎన్నికలపై రామ్‌నాథ్ కోవింద్ కమిటీ రాష్ట్రపతికి నివేదికను అందజేసింది. తొలి దశలో లోక్‌సభ, అసెంబ్లీలకు జమిలి ఎన్నికల నిర్వహణకు సిఫారసు చేసింది. రెండో దశలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని రిపోర్ట్ ఇచ్చింది. అదేవిధంగా జమిలి ఎన్నికల కోసం దేశ వ్యాప్తంగా ఒకే ఓటరు జాబితా తయారీకి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ప్రతిపాదనలు చేసింది. అయితే, ఒకే దేశం ఒకే ఎన్నిక ముసాయిదా బిల్లును కేంద్ర న్యాయ శాఖ రూపొందించింది. మరోవైపు జమిలి ఎన్నికలకు దాదాపు 32 రాజకీయ పార్టీలు అంగీకారం తెలుపగా మరో 13 పార్టీలు వ్యతిరేకించాయి. కాగా, జమిలి ఎన్నికల బిల్లును ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. 2027లో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలతో పాటు లోక్‌సభకు కూడా ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.



## రాష్ట్ర వ్యాప్తంగా ధరణి పోర్టల్ సేవలు బంద్

మొదటి పేజీ తరువాయి

నుంచే ధరణి ఓటీపీలు కూడా రావడం లేదని మీ సేవా నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. అంతకు ముందు రెండు రోజులు ధరణి పోర్టల్ ద్వారా ఓన్లీ సేల్ డీడ్ మాత్రమే అయ్యాయి. టీఎం 33, గిఫ్ట్ డీడ్స్ వంటి మాడ్యూల్స్ పని చేయలేదు. మధ్య మధ్యలో సైట్ లోడింగ్ అని చూపించింది. టెర్రాసిస్ సృష్టించిన సాఫ్ట్ వేర్, పోర్టల్ ని యథాతథంగా వాడడం ద్వారా అనేక సమస్యలు తలెత్తుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైగా ధరణి పోర్టల్ 35 మాడ్యూళ్లతో గందరగోళం నెలకొన్నది. దీన్ని సరళీకృతం చేసే పనిని ఎంతగా చేపట్టినా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని సమాచారం. తక్కువ మాడ్యూల్స్ తోనే రైతులకు సేవలందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఏ సమస్య ఉన్నా ఒక్క మాడ్యూల్ కిందనే దరఖాస్తు చేసుకునే వెసులుబాటును తీసుకురానున్నారు. ఐతే టెర్రాసిస్ రూపొందించిన సాఫ్ట్ వేర్ తో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే ధరణి పోర్టల్ నిర్వహణను చేపట్టిన ఎన్ఐసీకి కూడా తలనొప్పిగా మారిందన్న వార్తలు వినిపిస్తున్నాయి.

## ప్రార్థన స్థలాల కొత్త పిటిషన్లు దాఖలు చేయొద్దు


న్యూ ఢిల్లీ, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): దేశంలోని పలు ఆలయాలకు, మసీదులు, ఇతరతత్రా ప్రార్థన స్థలాలకు సంబంధించిన ఇప్పట్లో కొత్త పిటిషన్లను దాఖలు చేయొద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మధుర, కాశీ క్షేత్రాల కేసులు ఇప్పటికే తమ దృష్టిలో ఉన్నాయని ఈ తరుణంలో మరిన్ని పిటిషన్లు వేయొద్దని సీజేఐ సంజీవ్‌ఖన్నా గురువారం ఆదేశాలు జారీ చేశారు. 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టం పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణ జరుపుతోంది. ఈ పిటిషన్లపై నాలుగు వారాల్లోగా సమాధానాలు తెలియజేయాలని కేంద్రాన్ని సీజేఐ ధర్మాసనం ఆదేశించింది. అఫిడవిట్ దాఖలుకు కేంద్రానికి నాలుగు వారాల టైం ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రార్థన స్థలాల్లో సర్వేలనూ నిలిపివేయాలని ఆదేశించింది కోర్టు. అంతేకాదు తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఏ కోర్టులోనూ (హైకోర్టులు సహా) సర్వే సంబంధిత పిటిషన్లు తీసుకోకూడదని, ఈ వ్యవహారానికి సంబంధించిన పెండింగ్ కేసుల్లో మధ్యంతర, తుది ఉత్తర్వులు జారీ చేయకూడదని కింది కోర్టులకు ఆదేశాలు జారీ చేసింది.

## సంతోష్ ట్రోఫీ పోస్టర్ ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

మొదటి పేజీ తరువాయి

ప్రతిష్టాత్మకంగా జరిగే సంతోష్ ట్రోఫీకి ఈ సంవత్సరం హైదరాబాద్ ఆతిథ్యం ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ ట్రోఫీ డిసెంబర్ 14 నుండి డిసెంబర్ 31 వరకు హైదరాబాద్ నగరంలో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలోనే సంతోష్ ట్రోఫీ పోస్టర్ ను సీఎం రేవంత్ రెడ్డి గురువారం న్యూఢిల్లీలోని తన నివాసంలో ఆవిష్కరించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, రఘురాం రెడ్డి, జీ వంశీ కృష్ణ, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు జితేందర్ రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు డాక్టర్ రోహిన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ 57 సంవత్సరాల తర్వాత హైదరాబాద్ నగరం చారిత్రాత్మకమైన ఫుట్ బాల్ క్రీడా ప్రతిష్టాత్మక టోర్నీ సంతోష్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. డిసెంబర్ 14 నుండి డిసెంబర్ 31 వరకు దాదాపు 37 వివిధ రాష్ట్రాల జట్లు పాల్గొంటున్న ఈ సంతోష్ ట్రోఫీ కి సంబంధించి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని శివసేనారెడ్డి తెలిపారు.

## ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా గ్రాండ్‌మాస్టర్ గుకేష్



మొదటి పేజీ తరువాయి

లిరెన్‌ను ఓడించి 18వ ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుని గుకేశ్ చరిత్ర సృష్టించాడు. ఎండ్‌గేమ్ ఐదవ గంట వరకు లాగడంతో, డింగ్ 55వ ఎత్తుగడలో ఒక పొరపాటు చేసాడు, అది అతనికి మ్యాచ్ మరియు కిరీటాన్ని కోల్పోయింది. ఛాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ 6.5 పాయింట్లు సాధించగా, భారత్‌కు చెందిన 18 ఏళ్ల ప్రాడిజీ 7.5 పాయింట్లు సాధించి తన ఉల్క పెరుగుదలను అధిగమించాడు. మొత్తం 14 మ్యాచ్‌ల్లో, గుకేశ్ మూడింటిలో గెలుపొందగా, డింగ్ రెండింట్లో విజయం సాధించగా, మిగిలిన తొమ్మిది మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. తన ప్రత్యర్థి డింగ్‌తో కరచాలనం చేసిన తర్వాత భారత గ్రాండ్‌మాస్టర్ ఉద్వేగానికి లోనయ్యాడు. గుకేష్ ఏడుస్తూ కనిపించాడు. ఇది తన జీవితంలో అత్యుత్తమ క్షణమని చెప్పాడు. కార్ల్‌సెన్, క్రామ్నిక్ మరియు కాస్పరోవ్ ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా మారినప్పుడు చరిత్రలో ఏ వ్యక్తి కూడా 18 ఏళ్ల వయస్సులో ఉన్నాడు. గతంలో 22 ఏళ్ల వయసులో గ్యారీ కాస్పరోవ్ పేరిట ఉన్న రికార్డును గుకేశ్ బద్దలు కొట్టాడు. నాలుగు సార్లు టైటిల్‌ను గెలుచుకున్న విశ్వనాథన్ ఆనంద్ తర్వాత భారతదేశం నుండి గుకేశ్ రెండవ ప్రపంచ ఛాంపియన్. విశ్వనాథన్ ఆనంద్ గూకేష్ సాధించిన ఘనతను అభినందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో, ఇది చెస్‌కు గర్వించదగిన క్షణం మరియు భారతదేశానికి గర్వించదగిన క్షణం అని అన్నారు. తనకు ఇది చాలా వ్యక్తిగతంగా గర్వకారణమని ఆయన అన్నారు.

## ఒక్కరూ బయ్యారం ఉక్కు పరిశ్రమకై మాట్లాడక పోవటం సరికాదు

మొదటి పేజీ తరువాయి

పరిశ్రమ కోసం మాట్లాడకపోవటం సరికాదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. బయ్యారం ఉక్కు-తెలంగాణ హక్కు అంటూ తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తున్నామన్నారు. 2013లోనే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కేసీఆర్ లేఖ రాశారు. బయ్యారంలో లక్షా 41 వేలకు పైగా ఎకరాల్లో 300 మిలియన్ టన్నులకుపైగా ఐరన్ ఓర్ నిల్వలు ఉన్నాయని కేంద్రానికి నివేదించారు. అక్కడ ఉక్కు పరిశ్రమ వస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు పెరుగుతాయి అన్నది కేసీఆర్ ఆలోచన. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విభజన చట్టంలో ఉంది. కేంద్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా చట్టాన్ని మాత్రం అమలు చేయాల్సిందే. కేంద్రంలో పదేండ్లకు పైగా అధికారంలో ఉన్న బీజేపీ హామీని అమలు చేయడం లేదు. ఐరన్ ఓర్ నాణ్యత నేపథ్యంలో ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని బీజేపీ ప్రభుత్వం సాకు చూపిడం కరెక్ట్‌కాదు. బీజేపీకి తెలంగాణ పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి, ప్రేమ ఉన్నా తక్షణమే బయ్యారంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలి అని కవిత ట్వీట్‌చేశారు.

## మహిళలల ఆర్థిక బలోపేతానికి ఇంకో కొత్త స్కీమ్

మొదటి పేజీ తరువాయి

రెడీ అయింది.

**కొత్త పథకం రెడీ**

ఎలక్ట్రిక్ ఆటోల్ని నడిపే మహిళలకు ఆర్థిక సహకారాన్ని అందించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందట. ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మహిళల కోసం నయా స్కీమ్ రూపొందించడంపై నజర్ పెట్టిందని తెలుస్తోంది. రోజురోజుకీ పెరిగిపోతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) నూతన పాలసీని సర్కారు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఒకవైపు కాలుష్యాన్ని నియంత్రించే ఈవీల వాడకాన్ని ప్రోత్సహిస్తూనే మరోవైపు స్త్రీల స్వావలంబనకు సహకరించాలని గవర్నమెంట్ భావిస్తున్నట్లు సమాచారం.



**అమల్లోకి వస్తే**

ఎలక్ట్రిక్ ఆటోల్ని కొనుగోలు చేసి డ్రైవింగ్ చేసే మహిళలకు ఆర్థికంగా సహకారాన్ని అందించాలని రేవంత్ సర్కారు భావిస్తోందట. దీనికి సంబంధించి ఆటో డ్రైవింగ్ నేర్పించే ఒక సంస్థ ఆ శాఖ ఉన్నతాధికారులను రీసెంట్‌గా కలిసిందట. ఈ కొత్త పథకం అమల్లోకి వస్తే ఆటో కొనుగోలుకు అయ్యే వ్యయంలో కొంత మొత్తాన్ని రాష్ట్ర సర్కారే భరించనుందని వినిపిస్తోంది. ఈ పథకం తాలూకు ప్లానింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని సమాచారం. కాగా, ఈ ప్రతిపాదిత పథకంపై తెలంగాణ ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. త్వరలోనే ఈ పథకం అమల్లోకి రానుందని, రేవంత్ నిర్ణయం మేరకు స్కీమ్‌ను స్టార్ట్ చేసేందుకు స్త్రీ, సంక్షేమ శాఖ అధికారులు సమాయత్తం అవుతున్నారని వినిపిస్తోంది.

## కేబినెట్ విస్తరణపై తుది నిర్ణయం హైకమాండ్‌దే

మొదటి పేజీ తరువాయి

వ్యతిరేకత ఉండటం సహజమని అన్నారు. రాష్ట్రంలో చెరువులు, కుంటలు, ప్రభుత్వం స్థలాల పరిరక్షణకు హైడ్రా తీసుకొచ్చామని పేర్కొన్నారు. హైడ్రా అనేది స్వసంత్ర సంస్థ అని దానికి ధనిక, పేద అనే తారతమ్యాలు లేవని అన్నారు. చెరువులను ఎవరు ఆక్రమించినా వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. రైతులకు ఇచ్చే బోనస్‌తో వారికి ఎక్కువ లబ్ధి కలుగుతోందని అన్నారు. తాము పాలనపై దృష్టి పెట్టాం కాబట్టే ప్రచారంలో వెనుకబడ్డామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఇక రైతు భరోసా పథకాన్ని సంక్రాంతి నుంచి అమలు చేయబోతున్నామని ప్రకటించారు. గత సర్కార్ చేసిన అప్పులకు ఇప్పటి వరకు రూ.64 వేల కోట్లు అసలు, వడ్డీలు కట్టామని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన కంటే తాము ప్రజలకు మెరుగైన పాలన అందజేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రధాన ప్రతిపక్షానికి కౌంటర్ ఇచ్చారు.



## ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లపై ఇంటర్ బోర్డు దృష్టి

### మార్చి మొదటివారంలో పరీక్షలకు నిర్ణయం

హైదరాబాద్, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లపై ఇంటర్ బోర్డు దృష్టి సారించింది. మార్చి మొదటివారంలో పరీక్షలు ప్రారంభించాలని నిర్ణయించింది. మార్చి మూడో తేదీ నుంచి ఎగ్జామ్స్ నిర్వహించాలని యోచిస్తున్నది. దీనికి అనుగుణంగా అధికారులు షెడ్యూల్ రెడీ చేస్తున్నట్టు తెలుస్తున్నది. మార్చి నెలాఖరులోగా ఈ పరీక్షలు పూర్తికానున్నాయి. మరోపక్క ఫిబ్రవరి ఫస్ట్ వీక్‌లో ప్రాక్టీకల్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల షెడ్యూల్ కూడా తయారు చేస్తున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా సుమారు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే ఏపీ రాష్ట్రానికి సంబంధించిన ఇంటర్, టెన్త్ పబ్లిక్ పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. దీంతో తెలంగాణ విద్యాశాఖ అధికారులు కూడా త్వరలోనే షెడ్యూల్ రిలీజ్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



## ప్రజావాణిలో ఫిర్యాదులపై టిజిఆర్టీసీ కీలక నిర్ణయం



హైదరాబాద్, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ప్రజావాణిలో నిత్యం తెలంగాణ ఆర్టీసీకి సంబంధించిన సర్వీస్ రిమూవల్ కేసులపై ఫిర్యాదులు వస్తున్నాయని గుర్తించిన ఆర్టీసీ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసుల పరిష్కారం కోసం ఆర్టీసీ అధికారులతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో ఒక చైర్మన్ సహా ఇద్దరు సభ్యులు ఉంటారు. ఈ కమిటీ సర్వీస్ నిమిత్తం వివిధ కేసులను పరిగణలోకి తీసుకొని పరిష్కరించనుంది. ఈ త్రిసభ్య కమిటీ చైర్మన్ గా లేబర్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ కుమార్ ను నియమించగా సభ్యులుగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ప్రజావాణి నోడల్ ఆఫీసర్ దివ్య కమిటీలో పని చేయనున్నారు. ఆర్టీసీ ఉద్యోగుల్లో గతంలో సర్వీస్ రిమూవల్ కేసులు నమోదైన వాటిని ఈ కమిటీ పరిశీలించనుంది. ఇప్పటికే ప్రజావాణిలో ఆర్టీసీకి సంబందించిన సర్వీస్ రిమువల్ కేసుల విషయమై ఫిర్యాదులను ఈ త్రిసభ్య కమిటీ పిలిచి రివ్యూ చేయాలని నిర్ణయించింది. అలాగే త్రిసభ్య కమిటీ కేసులో ఉన్న మెరిట్స్ ను బట్టి ఆర్టీసీ యాజమాన్యానికి రికమెండ్ చేయనుంది. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన ట్విట్టర్ ఖాతా ద్వారా పంచుకున్నారు.

## మహిళా సమాఖ్య సభ్యులకు యూనిఫాం చీరలు

మొదటి పేజీ తరువాయి

యూనిఫాం చీరలను సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ గురువారం మంత్రి సీతక్కకు చూయించారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో త్వరలో యూనిఫామ్ చీరల డిజైన్లను ఖరారు చేయనున్నారు. చీరల డిజైన్లు ఫైనలైజ్ చేసిన తర్వాత 63 లక్షల మంది మహిళ సంఘ సభ్యులకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై మహిళా సంఘాల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళా ఆర్థికాభివృద్ధి కోసం తెలంగాణ మహిళాశక్తి పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ స్కీమ్ కింద వచ్చే ఐదేళ్లలో మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ. లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలను అందించున్నారు. గ్రామాల్లోని మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించి వారిని కోటీశ్వర్లును చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందు కోసమే ఈ పథకం తీసుకువచ్చింది.

## ఢిల్లీ మహిళలకు ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ బంపర్ ఆఫర్

మొదటి పేజీ తరువాయి

మహిళలకు నెలకు రూ.1000 ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతో పాటు మరో బంపర్ ఆఫర్ కూడా ఇచ్చారు. ఢిల్లీలో ఆప్ తిరిగి అధికారంలోకి వస్తే మహిళా సమ్మాన్ యోజన కింద వెయ్యికి బదులుగా రూ. 2వేలు ఇస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది ( 2025) ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ కాలం ఫిబ్రవరి 23, 2025తో ముగుస్తుంది. ఇంకా తేదీ ప్రకటించక పోయి నప్పటికీ కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇచ్చిన మాట ప్రకారం ఢిల్లీ మహిళలకు మహిళా సమ్మాన్ యోజన పథకం కింద రూ.1000 ప్రకటించారు. మహిళలు రిజిస్టర్ చేయించుకొని లబ్ది పొందాలని ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ చెప్పారు. ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో ఆప్ రెండుసార్లు అధికారం చేపట్టింది. మూడోసారి కూడా అధికారాన్నినిలబెట్టుకోవాలని ప్రయత్నాలు ప్రారంభించింది. 70 మంది సభ్యులున్న అసెంబ్లీలో ఆప్ 2015లో 67 సీట్లు, 2020లో 63 సీట్లు గెలుచుకుంది.



# పాఠశాలలలో డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమంకు ఏర్పాట్లు

**– జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 40 శాతం డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ఈనెల 14,శనివారం రోజు జిల్లాలోని (125) విద్య సంస్థలలో పండుగ వాతావరణం లో కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సంక్షేమ వసతి గృహాలు,పాఠశాలల విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారని, అందుకు అనుగుణంగా విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఆహ్వానాలు పంపాలని, విద్యాసంస్థ ఆవరణలో శానిటేషన్ చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, నాణ్యమైన ఆహార పదార్థాలతో రుచికరమైన భోజనం సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల పై ప్రత్యేక దృష్టి పెట్టి పిల్లలకు నాణ్యమైన ఆహారం అందిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధనలు అందించుటకు కృషి చేస్తుందని, అందులో భాగంగా నే జిల్లాలో ప్రతి హాస్టల్ కి ఒక అధికారిని నియమించి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ప్రణాళిక ప్రకారం విద్యార్థుల యొక్క స్థితిగతులను తెలుసుకుంటూ అందిస్తున్న సౌకర్యాలను తనిఖీ చేస్తూ ఉన్నామని తెలిపారు. జిల్లాలో పక్కా ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టొప్పో, (రెవెన్యూ) కె.వీరబ్రహ్మచారి, జిల్లా పరిషత్ సీఈవో పురుషోత్తం, జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ నరసింహస్వామి, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సైదా నాయక్, సిపిఓ సుబ్బారావు, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాస్, డిపిఓ హరిప్రసాద్, అన్ని మండలాల నుండి వచ్చిన ప్రిన్సిపల్స్, వార్డెన్లు, ఎంపిఓలు, ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మాదకద్రవ్యాల పట్ల అవగాహన కల్పించాలి

**అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అన్నారు.గురువారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాస్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమావేశం సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న అన్ని కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలు అలవాటు ఉన్న వారిని గుర్తించి వారిని పునరావాస కేంద్రాల ద్వారా అలవాటు మాన్పించాలన్నారు. కళాశాలో మరియు నిర్వహించే పేరెంట్స్ టీచర్ సమావేశాలలో డ్రగ్స్, గంజాయి వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాల రవాణా, సాగు మరియు వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల పట్ల ఆకర్షితులు కాకుండా వారికి సమాజంలో మంచి, చెడు తెలియజేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఒత్తిడికి గురయ్యే విద్యార్థులలో ఆత్మ స్థాయిర్యాన్ని నింపేందుకు భయాన్ని పోగొట్టేందుకు మరియు ఇతర మానసిక ఒత్తిడిలకు గురి అయ్యే విద్యార్థులకు ప్రత్యేకంగా14416 టెలి మానస్ టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టెలి మానస్ కు కాల్ చేస్తే నిపుణులైన మానసిక వైద్యులు ఉచిత కౌన్సెలింగ్ సేవలు అందిస్తారని చెప్పారు. ఈ సమావేశంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏ ఆర్ డి.ఎస్.పి సత్యనారాయణ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, ములకలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సులోచన రాణి మరియు స్ట్రెస్ మేనేజ్మెంట్ అధికారి ఆదిశేషు, అన్ని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్స్ మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 14న గురుకుల హాస్టళ్ల లో ప్రత్యేక కార్యక్రమం

**– హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య**



హనుమకొండ డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లాలోని అన్ని గురుకుల హాస్టళ్లలో ఈనెల 14వ తేదీన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య తెలిపారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గురుకుల హాస్టల్ విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ప్రభుత్వం గురుకుల హాస్టల్ విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలను పెంచిందన్నారు. అదేవిధంగా 16 సంవత్సరాల తర్వాత ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచిందని పేర్కొన్నారు. గురుకుల విద్యార్థుల కోసం పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో అంతర్జాతీయ విద్య ప్రమాణాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. గురుకుల హాస్టల్ విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందిస్తుందన్నారు. ఈనెల 14వ తేదీ నుండి అమలయ్యే నూతన డైట్, కాస్మోటిక్ చార్జీల పై జిల్లాలోని ప్రతి గురుకుల హాస్టల్ లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా, జోనల్, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. సంబంధిత గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా చూడాలన్నారు. పెంచిన డైట్, కాస్మోటిక్ చార్జీల వివరాలను తెలిపేలా బ్యానర్లను ప్రతి గురుకుల హాస్టల్ లో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి గురుకుల విద్యాసంస్థ పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పెంచిన డైట్ చార్జీలకు అనుగుణంగా విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన పౌష్టిక ఆహారాన్ని తప్పనిసరిగా అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, డీఈవో వాసంతి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ సర్వే పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఇందిరమ్మ ఇండ్ల యాప్ సర్వే, గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ మరియు నూతన డైట్ మెనూ పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమాల పై అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనలతో కలిసి జిల్లాలోని ఆర్డీవోలు, తాసిల్దార్లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ సెక్రటరీలు మరియు సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే త్వరితగతిన పూర్తయ్యేలా తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి దరఖాస్తు నమోదు చేపట్టాలని, నమోదు ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. దరఖాస్తుదారులు ఒకచోట నివసిస్తూ ఉండి వారికి వేరొక ప్రదేశంలో స్థలం ఉన్నచో అటువంటి దరఖాస్తులను తీసుకొని వివరణలో తగిన వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి దరఖాస్తులు యాప్ లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా మండల మరియు గ్రామస్థాయిలో ఎన్ని దరఖాస్తులు ఉన్నవి నివేదికలు తయారు చేసుకొని ఎక్కువ దరఖాస్తులు ఉన్నచోట సర్వేకు అదనపు సిబ్బందిని కేటాయించాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం మరియు కొత్తగూడెం ఆర్డీవోలు ఇందిరమ్మ ఇండ్ల మోడల్ హౌస్ నిర్మాణం కోసం స్థలం గుర్తించి త్వరితగతిన మోడల్ హౌస్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. గ్రూప్ 2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 15,16 తేదీలలో గ్రూప్ టు పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు.ఈ నెల 15వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు పేపర్ – 1 పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 గంటల వరకు పేపర్ – 2 పరీక్ష, అలాగే 16వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు పేపర్ – 3 పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5:30 గంటల వరకు పేపర్ – 4 పరీక్ష జరగనుందని తెలిపారు. జిల్లాలో మొత్తం (13465) మంది అభ్యర్థులు (38) పరీక్ష కేంద్రాల్లో ఈ గ్రూప్–2 పరీక్షకు హాజరుకానున్నట్లు వివరించారు. అలాగే చీఫ్ సూపరింటెండెంట్ లు (38), డిపార్ట్మెంటల్ అధికారులు (38), అబ్జర్వర్ లు (40), ఫ్లయింగ్ స్క్వాడ్ లు (12), బయోమెట్రిక్ అధికారులు (43), ఐడెంటిఫికేషన్ అధికారులు (134), ఆరు రూట్లలో ఆరుగురు లోకల్, జాయింట్ రూట్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లను అనుమతించరాదన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. పరీక్ష సమయానికి 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్ష కేంద్రాలను సంబంధిత అధికారులు సందర్శించి, మౌలిక వసతులను కల్పించాలని, నిరంతర విద్యుత్ సరఫరా జరగాలని, ఆర్టీసీ బస్సులు సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ కిట్, సిబ్బంది అందుబాటులో ఉండాలని, పరీక్ష పేపర్లు, ఓఎంఆర్ షీట్ లను పకడ్బందీగా, తగిన జాగ్రత్త చర్యల నడుమ తప్పనిసరిగా ఎస్కార్ట్ తో ప్రభుత్వ వాహనాల్లో పరీక్ష కేంద్రాలకు తరలించాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సమయానుకూలంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పిల్లలు అందించే డైట్ చార్జీలను 40 శాతం పెంచిందని, డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీవోలు, జిల్లా అధికారులు మరియు పంచాయతీ అధికారులు తమ పరిధిలోని హాస్టల్స్ ఆశ్రమ పాఠశాలలు రెసిడెన్షియల్ పాఠశాలలు అన్ని రకాల పాఠశాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. 40 శాతం డైట్ చార్జీలు పెంచినందున పిల్లలకు నాణ్యమైన భోజనం అందుతుందని దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలని, ముఖ్యంగా తల్లి హాజరయ్యే విధంగా చూసుకోవాలని అన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమం జరగాలని, ఆ రోజు విద్యార్థులకు స్పెషల్ ఆహారం అందించాలని, ప్రతి విద్యా సంస్థలు మెన్యు కు సంబంధించి వివరాల ఫ్లెక్సీ ప్రచురణ చేయాలని అన్నారు.

# వైద్య రంగానికి ప్రభుత్వం పెద్దపీట

**108 అంబులెన్స్ ప్రారంభం**

**ఘనపూర్ (స్టేషన్) ఎమ్మెల్యే కడియం శ్రీహరి**




జనగామ జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): పేదలకు వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, దీని ఫలితంగా పేదలకు నాణ్యమైన వైద్యం అందుతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి అన్నారు. గురువారం, జిల్లాలోని లింగాల గణపురం మండలానికి మంజూరైన నూతన 108 అంబులెన్స్ వాహనాన్ని అదనపు కలెక్టర్ రెవెన్యూ రోహిత్ సింగ్ తో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిష్ణాతులైన వైద్యులను నియమించారని పేర్కొన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ముఖ్యంగా రోగులకు అవసరమయ్యే ఔషధాలు, ప్రత్యేకించి మహిళల, పురుషుల వార్డులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. నియోజకవర్గ ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించడానికి త్వరలో వంద పడకల ఆసుపత్రిని నిర్మించుకోబోతున్నామని తెలియజేశారు. ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలో మొత్తం తొమ్మిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని, త్వరలోనే మరో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. అదే విధంగా మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున్ రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీదేవి, ప్రోగ్రామింగ్ అధికారి రవీందర్ గౌడ్, తహసిల్దార్ రవీందర్, ఇతర వైద్య అధికారులు, వైద్యులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో నూతన డైట్ కార్యక్రమాన్ని నిర్వహించాలి

**– ఈనెల 14న గురుకుల హాస్టళ్ల లో ప్రత్యేక కార్యక్రమం**

**– జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్, కెజిబివి పాఠశాలల్లో ఈనెల 14వ తేదీన నూతన డైట్ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలనీ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ వేశ మందిరంలో గురుకుల హాస్టల్ విద్యార్థుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, కెజిబివి, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచిన నేపథ్యంలో ఈ నెల 14వ తేదీన జిల్లాలోని 84 వసతి గృహాల్లో నూతన డైట్ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం గురుకుల హాస్టల్ విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలను పెంచిందన్నారు. అదేవిధంగా 16 సంవత్సరాల తర్వాత ప్రభుత్వం కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచిందని పేర్కొన్నారు. గురుకుల విద్యార్థుల కోసం పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందన్నారు. విద్యార్థుల తల్లులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి వారి సమక్షంలో వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించాలన్నారు. ప్రజా ప్రతినిధులను ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానించాలని సూచించారు. వంట శాలలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు కార్యక్రమ ప్రత్యేక అధికారులుగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్స్ పిల్లల తల్లి తండ్రులకు సమాచారం ఇచ్చి ఆహ్వానించాలని ఆదేశించారు. ప్రముఖులు వస్తారని లోటు పాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. భోజనం క్వాలిటీ, క్వాన్టిటి పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా తల్లులకు వారి పిల్లల ఆహార అలవాట్లపై అవగాహన కల్పించడం, పౌష్టికాహారంపై శ్రద్ధ పెంచడం ప్రధాన ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. అందుకే ఈ పండుగను పాఠశాలలలోనే కాకుండా విద్యార్థుల కుటుంబ సభ్యులు కూడా సంతోషంగా పాల్గొనేలా నిర్వహించాలని సూచించారు. ఏమి మెనూ ఇస్తున్నామో తల్లితండ్రులకు తెలియాలని, ఆ క్రమంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో అంతర్జాతీయ విద్య ప్రమాణాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. గురుకుల హాస్టల్ విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో కూడిన పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా, జోనల్, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడి ఓ లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థల్లో ర్యాగింగ్ ను నిర్మూలించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**విద్యార్థుల హాజరు డ్రాప్ ఔట్ లేకుండా చూడాలి**



వరంగల్ జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల హాజరు, మానసిక స్థైర్యం, తదితర అంశాలను కళాశాల యాజమాన్యాలు నిరంతరం సమీక్షిస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అన్ని కళాశాలల్లో ఆంటీ–డ్రగ్ కమిటీలు, టెలీమానస్, పరీక్ష ఫీజుల చెల్లింపు, అడ్మిషన్లు, డ్రాపవుట్ విద్యార్థుల హాజరు మెరుగు పర్చుకోవడం పై చర్యలు, పేరెంట్స్ కమిటీ మీటింగ్ తదితర అంశాలపై నివేదికలు సేకరించాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్ ఫోన్లకు బానిసలై పోతున్నారని చదువుమీద, కుటుంబ బాధ్యతలపట్ల తల్లిదండ్రుల పట్ల నిరంతరం వారితో మాట్లాడి అన్నారు. రానున్న వార్షిక పరీక్షల్లో అధ్యాపకులు ప్రణాళిక బద్ధంగా బోధన చేసి 100 శాతం ఉత్తీర్ణత ఫలితాలను సాధించాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులుతో పాటు, వారు కూడా ఉత్తీర్ణులు అయ్యేందుకు ప్రణాళికతో పని చేయాలని ఆదేశించారు. కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, మత్తు పదార్థాల పట్ల అవగాహన కల్పించాలని అన్నారు. ర్యాగింగ్ అనేది పరిచయం పెంచుకునే లా ఉండాలి విద్యార్థులకు మద్దతుగా భావించే గౌరవం, సానుభూతి, కలుపుకుని పోయే స్వభావ సంస్కృతిని ప్రతిబింబించేలా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాస్థాయి అధికారులు, మమునూర్ ఏసీపీ తిరుపతి, డిఆర్వో విజయ లక్ష్మి, ఆర్.అండ్ బి ఈఈ జితేందర్ రెడ్డి, జిల్లా విద్యాధికారి జ్ఞానేశ్వర్, డీయంహెచ్ ఓ సాంబశివరావు, జిల్లా మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ మోహన్ దాస్, ప్రభుత్వరంగ కళాశాలల రీజినల్ కో–ఆర్డినేటర్లు, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.ఎం.కే ఇథనాలు ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలి

- ప్రజల ప్రాణాలను కబలించి ఇథనాల్ ఫ్యాక్టరీ మాకొద్దు
- ఫ్యాక్టరీ నిర్మిస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారు
- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య







సూర్యాపేట, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా మోతే మండలం రావి పహాడ్ గ్రామంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రావిపహాడ్ గ్రామంలో ఇథనాలు ఫ్యాక్టరీ ముందు సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ అధ్వర్యంలో చేస్తున్న ధర్నాలో అఖిలపక్ష పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా గ్రామాలలో ఇథనాల్ ఫ్యాక్టరీలను అనుమతించడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. ఇథనాలు ఫ్యాక్టరీ ఈ గ్రామంలో నిర్మిస్తే చుట్టుపది కిలోమీటర్ల పొడవున భూమి మొత్తం ఎడారిగా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. పచ్చని పంట పొలాలలో ఫ్యాక్టరీలు నిర్మించి విష వాయువులు చిందించే హక్కు ఏ ప్రభుత్వానికి లేదన్నారు. మనుషుల ప్రాణాలను, పశుపక్షాది జీవరాశులను నాశనం చేసే హక్కు ఏ రాజ్యాంగం మీకు కల్పించిందని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే, రోజుకు 7లక్షల 50 వేల లీటర్ల నీరు ఫ్యాక్టరీ వాళ్ళు వినియోగిస్తే భూగర్భ జలాలు మొత్తం అడుగంటిపోయి పంట భూములు ఎడారులుగా మారుతాయి అన్నారు. పాలేరు జలాల మీద ఆధారపడే రైతుల పంటలు ఎండిపోతాయి అని కంపెనీ వలన చిన్న సన్న కారు రైతులు వేసుకున్న బోరు బావులు ఎండిపోయే ప్రమాదం ఉందని పంటలు పండక గ్రామీణ ప్రజానీకం పట్టణాలకు వలస పోయే ప్రమాదం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని నుండే వెలవాడే వ్యర్థాలు పాలేరు నదిలో కలిస్తే పాలేరు పరివాహక ప్రాంతాల ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది అన్నారు. పర్యావరణాన్ని ప్రేమించాలని చెప్పే పాలకులు పర్యావరణాన్ని హరించి వేసే ఇలాంటి విషపు ఫ్యాక్టరీలకు అనుమతులు ఎలా ఇచ్చారని నిలదీశారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించి, ప్రజలను నిస్సహాయులుగా తయారు చేసే ఈ ఫ్యాక్టరీ అనుమతులను వెంటనే రద్దుచేసి పర్యావరణానికి, పశుపక్షాదులకు సమస్త జీవరాశిని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పందిరి నాగిరెడ్డి, సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివ కుమార్, జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, రావిపహాడ్ రైతులు, కూడలి సర్పంచ్ నరసింహ రావు, మాజీ సర్పంచ్ సంగెం లింగయ్య, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గోపాల్ రెడ్డి, పిఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు, టియుసీఐ జిల్లా అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్, సిపిఎం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సాగుభూమికి దారి లేక నరకయాతన

- పరిష్కారం కోసం ఎమ్మెల్యే చెప్పిన వినని అధికారులు
- రాజకీయ నాయకుల అండదండలతో రైతులకు బెదిరింపులు
- ఆందోళన చెందుతున్న పలు గ్రామాల రైతులు





దేవరకద్ర, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): తాతలు, ముత్తాతలు కాలం తండ్రుల కాలం నుంచి భూముల్లో దశాబ్దాలపాటు పంటలు పండించిన రైతులకు, వ్యవసాయ కూలీ పనులకు వెళ్తున్నారు. కానీ.. వారి పొలాలకు వెళ్లే దారి గుంతల తొవ్వడంతో ముండ్ల కంపలు వేయడం మరియు మూసుకుపోవడంతో కొన్ని సంవత్సరాలు నుంచి 150 ఎకరాలకు రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం పరిధిలోని పలు గ్రామాలలో రైతుల పొలాలకు దారి (బాట) లేక నరకయాతన అనుభవిస్తున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కి రైతులు వెళ్లే పొలం బాట (దారి) సమస్యపై వారి దృష్టికి తీసుకెళ్లి విన్నవించారు. మండల తహసిల్దార్ కు పలు శాఖ అధికారులకు రైతుల బాట సమస్యపై వెంటనే పరిష్కారం చేయాలని ఫోన్ లో మాట్లాడుతూ ఆదేశాలు జారీ చేశారు. అట్టి విషయాన్ని పట్టించుకోకుండా దేవరకద్ర ఎమ్మెల్యే మాటలను వినకుండా పెడదారిన పెట్టినరని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు రైతులకు రైతులకు మధ్య గొడవలకు చిచ్చు పెడుతున్నారని పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆ గ్రామ రైతులు తమ పొలాల్లోకి వెళ్లి సాగు చేసుకునేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరతరాలుగా రైతు కుటుంబాలు నడిచిన దారి ఒక్కసారిగా కనుమరుగవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు దారి చూపి ఆదుకునేది ఎవరని కోరుతున్నారు.

**రైతులకు బెదిరింపులు..**

దారి లేక ఇబ్బందులు పడుతున్నామని అడిగిన కొంతమంది రైతులను రాజకీయ నాయకుల అండతో బెదిరింపులకుపాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండల అధికారులకు వివిధ పార్టీ రాజకీయ నాయకుల అండదండలతో ఉండడంతో వారు చెప్పిందే చేస్తూ రైతులను బెదిరిస్తూ ఎమ్మెల్యే వచ్చిన కలెక్టర్ వచ్చిన ఈ దారి పరిష్కరించకుండా అడ్డుకుంటామని తెగించి చెప్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాగు భూముల్లోకి వెళ్లేందుకు దారి చూపండంటూ పలు గ్రామాల రైతులు కొన్ని సంవత్సరాలుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దారి లేకపోతే తమ పంట భూములన్నీ బీళ్లుగా మారిపోయాయని కోరుతున్నారు. కావున వెంటనే దేవరకద్ర ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్ చొరవ చూపి తమ వ్యవసాయ భూముల్లోకి తాము వెళ్లేందుకు దారి చూపాలని రైతులు వేడుకుంటున్నారు.

# అర్హులైన పేదలకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇల్లు

**బిఆర్ఎస్ నేత రాపోలు నవీన్ కుమార్**



సూర్యాపేట, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): అర్హులైన పేదలకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ నేత రాపోలు నవీన్ అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ

ఇందిరమ్మ ఇళ్ల నియామకాల్లో కాంగ్రెస్ పార్టీ మంత్రుల మాటలు ఒకరికి ఒకరికి పొంతన లేకుండా ఉన్నాయని ఎద్దేవా చేశారు. జిల్లాకు చెందిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని ప్రకటిస్తే ఖమ్మం జిల్లాకు చెందిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరొక విధంగా ప్రకటిస్తారని ముఖ్యమంత్రికి పరిపాలనపై పట్టు లేకపోవడం వల్లనే ఈ దుస్థితి దాపురించిందని ఆయన అన్నారు. ఖాళీ స్థలం ఉండి అంగవైకల్యం ఉన్నవారికి తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న వారికి ఒంటరి మహిళలకు ముందుగా ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులు ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా చేయగలిగే శక్తి రాష్ట్ర మంత్రులకు ఉన్నదా అని ఆయన ప్రశ్నించారు. రేషన్ కార్డుల పంపిణీని కూడా నిత్య%శీ% వాయిదా వేస్తున్నారని రేషన్ షాప్ ల ద్వారా సన్నబియ్యం జనవరి నుంచి పంపిణీ చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన సూర్యాపేట జిల్లా మంత్రి తన మాట మీద నిలబడగలరా అని ఆయన ప్రశ్నించారు ప్రజాపాలనగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం దగా పాలనగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బీఆరెస్ కెవి మండల అధ్యక్షులు కనకరాజుల రాంబాబు, సీనియర్ నాయకులు ఇంజమూరి రాజేష్ , కుర్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పరీక్ష సమయంలో ఒత్తిడిలకు గురికా వద్దు

- హెల్ప్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో



ఆత్మకూర్, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెల్ప్ సంస్థ వారు హార్ట్ ఫుల్ నెస్ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులకు గురువారం రోజు పరీక్ష సమయంలో విద్యార్థులు ఆందోళన మరియు భయాలకు ఒత్తిడి లకు గురికాకూడదని ప్రశాంత వాతావరణంలో బాగా చదివి ఇంటర్మీడియట్ పరీక్షలో మంచి ఫలితాలు సాధించాలని ఉద్దేశంతో యోగ మరియు ధ్యానం వంటి ప్రేరణ తరగతులను కళాశాల విద్యార్థులకు నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో హెల్ప్ సంస్థ వారు శ్రీ పాండు, రామాంజనేయులు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. భాగ్య వర్ధన్ రెడ్డి మరియు కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఖోఖో విభాగంలో మండల విద్యార్థులు ప్రథమ బహుమతి




ఆత్మకూర్, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రజా పాలన విజయవత్సవల సంబరాల్లో భాగంగా నిర్వహించిన సీఎం కప్ ఆట పోటీలు కొక్కో విభాగంలో ఆత్మకూరు మండలం అర్బన్ విభాగం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా ప్రథమ బహుమతిని సాధించిన విద్యార్థులకు మరియు వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహ యాదవ్ ను పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఎం లక్ష్మారెడ్డి శాలువాతో సత్కరించి వారిని అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం చిలకమ్మా పద్మావతి నితిన్ సాయికుమార్ రవికుమార్ శ్రీకాంత్ వీరితోపాటు స్కూల్ హెడ్మాస్టర్ మదిలేటి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రైస్ మిల్లులను తరలించండి

- ప్రజల ఆరోగ్యాలు హాని చేస్తున్నందున మిల్లులను తరలించాలి



వనపర్తి జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): నాలుగవ వార్డ్ లోకనాథ్ రెడ్డి మిల్లు, 22వ వార్డు ఫరీద్ మిల్లు, 28వ వార్డు సత్యనారాయణ మిల్, 30 వార్డ్ నాగేందర్ మిల్లు, 31 వ వార్డు ప్రతాప్ రెడ్డి మిల్లు, ఊరి నడిబొడ్డిన ఉన్నాయి. వీటిపై చాలా రోజులుగా ప్రజలు పలు విధాలుగా ఫిర్యాదు చేస్తూ, మిల్లులను తొలగించాలని ప్రజావాణి ద్వారా, ఐక్యవేదిక ద్వారా విన్నపాలు చేస్తున్నా చర్యలు తీసుకోవడంలేదనీ, ఈరోజు ప్రజలు మళ్లీ ఐక్యవేదికను ఆశ్రయించిన వెంటనే పలు మిల్లులను పరిశీలించిన ఐక్యవేదిక నాయకులు, ప్రతి మిల్లు దగ్గర రోడ్డుపై వెళ్తున్న పాదచారుల, వాహనదారుల కళ్ళల్లో దుమ్ము పడుతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే ఈ మిల్లుల ను ఊరి బయటకు పంపించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు కార్యక్రమం చేయడం జరిగింది. లేనియెడల దీనికి సంబంధించిన అధికారులపై వనపర్తికి వస్తున్న ముఖ్యమంత్రి గారికి ఫిర్యాదు చేయడం జరుగుతుందని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకులు హెచ్చరించారు. ఊరి నడిబొడ్డులో ఉండి ప్రతినిత్యం దుమ్ము వెలువరించే ఈ మిల్లులు ప్రజల ఆరోగ్యాన్ని చెడగొడుతున్నాయని అలాగే ఈ మిల్లుల ద్వారా వచ్చే దుమ్ము దూళి ప్రజల ఇళ్లలోకి, ఇంటి పైకి పడి ప్రతిరోజు గృహినులకు ఇబ్బంది కలిగిస్తుందని ఈ సమస్య తీవ్రతను గుర్తించి స్థానిక ఎమ్మెల్యే గారు జిల్లా కలెక్టర్ గారు వెంటనే చర్యలు తీసుకోవాలనీ ప్రజలు అఖిలపక్ష ఐక్యవేదిక ద్వారా హెచ్చరిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో సతీష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు,, టిడిపి రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, బి.ఎస్.పి టౌన్ ప్రెసిడెంట్ గంధం భరత్, గౌనికాడి యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, శరత్ చంద్ర, మరియు 4, 22, 28, 30 ,31 వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల వల్ల మెరుగైన భద్రత పరిరక్షణ

**అమరచింత ఎస్సై సురేష్**



అమరచింత, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండల పరిధిలోని ఈర్లదిన్నె గ్రామంలో అమరచింత పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల యొక్క ప్రాముఖ్యతను గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరచింత సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ సీసీ కెమెరాల వల్ల మెరుగైన భద్రత పరిరక్షణ ఉంటుందని దొంగతనాలు నివారణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని అదేవిధంగా సీసీ కెమెరాల యొక్కప్రాముఖ్యత గురించి గ్రామ ప్రజలకు వివరించారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ పెద్దలు అమరచింత పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వాలంటరీ నియామకానికి హామీ

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి




నర్వ, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): మక్తల్ నియోజకవర్గం పరిధిలోని నర్వ మండల కేంద్రం రాయికోడ్ గ్రామంలో మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోజు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి హాజరయ్యారు. గత సంవత్సరం తాను ఇచ్చిన హామీ మేరకు ఈ సంవత్సరం కూడా ఒక విద్యా వాలంటరీను నియమించాలని గ్రామస్తులు మరియు విద్యార్థులు కోరగా బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి వారి కోరిక మేరకు ఈ విద్యా సంవత్సరానికి కూడా విద్యా వాలంటరీకి నలభై వేల రూపాయలను ఇస్తానని మాట ఇచ్చారు. అనంతరం రాయికోడు గ్రామస్తులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ పెద్దలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 16 నుండి రామాలయంలో ధనుర్మాస ఉత్సవాలు





నేరేడుచర్ల, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): నేరేడుచర్ల లోని శ్రీ కోదండ రామాలయంలో ఈనెల 16 నుండి జనవరి 13 వరకు అత్యంత సాంప్రదాయ సిద్ధంగా వైభవంగా ధనుర్మాస ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గురువారం తెలిపారు, ఈనెల 16 నుండి జనవరి రెండు వరకు ప్రతిరోజు ఉదయం 4.00 గంటల నుండి 6.30 గంటల వరకు తిరుప్పావై సేవా కాలం, జనవరి 3 నుండి 13 వరకు ప్రతిరోజు ఉదయం 6.00 గంటల నుండి 10.00 గంటల వరకు తిరుప్పావై సేవా కాలం, జనవరి 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, జనవరి 11న కుడారై, జనవరి 13న భోగి కళ్యాణము నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ప్రతిరోజు జరిగే పూజా కార్యక్రమాల్లో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ధనుర్మాస ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు

# పాఠశాలకు బాట నేర్పిన గురువుకు శిష్యుడి సన్మానం

వనపర్తి జిల్లా, డిసెంబర్ 12 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం గట్ల ఖానాపూర్ పుల్యా తండాకు చెందిన మెగావత్ రవి నాయక్ కు గత వారం క్రితం చిట్యాల గురుకుల పాఠశాలలో లైబ్రరియన్ ఉద్యోగం చేస్తూ ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఫార్మసీలో డాక్టరేట్ పొందిన విషయం అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం రోజు చిన్ననాటి గురువు (ఉపాధ్యాయుడు) చంద్రయ్యను కలిసి శాలువాతో సన్మానించి పాదాభివందనాలు చేశారు. ఈ సందర్భంగా మెగావత్ రవి నాయక్ మాట్లాడుతూ... గట్ల ఖానాపూర్ గ్రామం మారుమూల గ్రామమైన పుల్యా తాండకు చెందిన బామిని పుల్యా దంపతులకు పుట్టి మారుమూల గ్రామంలో నిరుపేద కుటుంబంతో నివసిస్తున్న సందర్భంలో తండాకు ఎలాంటి రవాణా సౌకర్యం లేని ఆ రోజులలో మా గ్రామ పాఠశాలకు చంద్రయ్య అనే ఉపాధ్యాయుడు నియమితులయ్యారు. మా గురువు చంద్రయ్య ప్రతిరోజూ పెద్దమందడి నుండి సైకిల్ పై వచ్చి పుల్యా తండాలో ఇంటింటికి తిరిగి నాతోపాటు తాండ బాల బాలికలను పాఠశాలకు తీసుకొని పోయేవాడు. చెట్లల్లో గుట్టల్లో పశువులతో తిరుగుతూ ఇలాంటి వ్యక్తిగత శుభ్రత క్రమశిక్షణ లేని నాకు పాఠశాల బాటలు నేర్పిన మహనీయుడు అని వారు గుర్తు చేశారు. నాలుగవ తరగతి తర్వాత బీసీ హాస్టల్లో సీటు రాకుంటే ఎనిమిది నెలలు తన ఇంట్లో పెట్టుకొని నన్ను పాఠశాలకు పంపిన గొప్ప వ్యక్తి అని వారు కొనియాడారు. మా గురువు చంద్రయ్య మా తాండ



పాఠశాలకు వచ్చి మా తలరాతలు మార్చేశారని లేకుంటే నేను నిరక్షరాస్యునిగా పాలమూరు వలసవాది బిడ్డగా మిగిలిపోయే వాడినని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నాకు విద్యాబుద్ధులు నేర్పిన నా గురువు అయిన చంద్రయ్య ను సన్మానించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని వారు తెలిపారు. తల్లిదండ్రి తర్వాత కనిపించే దేవుడు ఏకైక వ్యక్తి విద్యాభ్యాసాలు నేర్పి గురువు అని వారు సంతోషం వ్యక్తం చేశారు. నా గురువు చంద్రయ్య నేర్పిన విద్యాబుద్ధుల వాళ్ళని నేను నేడు చిట్యాల పాఠశాలలో లైబ్రేరియన్ ఉద్యోగం పొందానని అలాగే ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఫార్మసీలో డాక్టర్ సర్టిఫికెట్ పొందడానికి కృషి చేసిన ఏకైక వ్యక్తి మా గురువు చంద్రయ్య అలాంటి గొప్ప వ్యక్తికి పాదాభివందనాలు తెలియజేస్తున్నామని వారు తెలిపారు.

# రైతులను ఉద్యాన పంటల వైపు మళ్లించేలా కృషి చేయాలి

**- ఉద్యానవన శాఖ అధికారులకు కోదండరెడ్డి సూచన**

హైదరాబాద్: రైతులను ఉద్యాన పంటల వైపు మళ్లించేందుకు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి సభ్యులు భవానీరెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో ఉద్యాన శాఖ అధికారులతో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సమావేశమైంది. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ రైతు తన కాళ్లపై తాను నిలబడేలా అందరం కలిసి పని చేద్దామని అభిప్రాయపడ్డారు. డ్రిప్ ఇరిగేషన్‌పై చాలా మంది రైతులు ఆధారపడి ఉద్యానవన పంటలు సాగుచేస్తున్నారని గుర్తు చేశారు. వారికీ ఆ పథకం అందుబాటులో లేదనీ, దాన్ని అందేలా చూడాలన్నారు. కేంద్రం నుంచి ఉద్యాన శాఖ రావాల్సిన నిధులను రాబట్టేలా ఎంపీ ఒత్తిడి తేవాలని కోరారు. మిర్చి,



పసుపు పంట సాగుచేసే రైతులు గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ చేయడం వల్ల ఆర్థిక భారం అవుతుందని చెప్పారు.

# బియ్యం కుంభకోణం

**- ప్రభుత్వానికి రూ. 217 కోట్ల కస్టమ్ మిల్లింగ్ రైస్ ఎగవేత**

**- దిర్శంచర్ల తిరుమల కార్పొరేషన్ రూ.107 కోట్ల బియ్యం ఎగవేత**

**- గరిడేపల్లిలో రూ.110 కోట్ల బియ్యం భాగోతం వెలుగులోకి..**

**- రెండు మిల్లుల నిర్వాహకులు తండ్రీకొడుకులే..**

**- సూర్యాపేట జిల్లాలోని నేరేడుచర్ల, గరిడేపల్లిలో కేసుల నమోదు**



నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వానికి మిల్లర్లు ఇవ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్‌కు సంబంధించి భారీ కుంభకోణం బయటపడింది. రెండు మిల్లుల నుంచి ప్రభుత్వానికి అందాల్సిన రూ.217 కోట్ల బియ్యం ఎగవేత వెలుగులోకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని ఐకేపీ, పీఏసీఎస్, మెప్మాల ద్వారా కొనుగోలు చేసి రైస్ మిల్లులకు కేటాయిస్తుంది. అయితే, కస్టమ్ మిల్లింగ్ పద్ధతి ఒప్పందం ప్రకారం ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని ఇవ్వకుండా బయట మార్కెట్‌లో అమ్ముకున్న వ్యవహారం బయటపడింది. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి, నేరేడుచర్ల మండలం దిర్సంచెర్ల మిల్లుల్లో రూ.217 కోట్ల కస్టమ్ మిల్లింగ్ బియ్యం కుంభకోణం వెలుగులోకి వచ్చింది. వీటి నిర్వాహకులు ఇద్దరూ తండ్రీకొడుకులు.దీనిపై కేసులు నమోదయ్యాయి. గరిడేపల్లిలో సంతోషిమా రైస్ మిల్లు కార్పొరేషన్ యజమాని బి.వెంకటేశ్వర్లు 2022-23 ఖరీఫ్, రబీ, 2023-24 ఖరీఫ్ పంటలకు చెందిన 33వేల 938 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. దాని విలువ రూ.110 కోట్లు. నేరేడుచర్ల మండలం దిర్సంచర్ల గ్రామంలోని తిరుమల రైస్ మిల్ కార్పొరేషన్‌కు చెందిన జి.రాజేష్ 2022 -23 ఖరీఫ్, రబీ, 2023-24 ఖరీఫ్ పంటకు సంబంధించిన 32వేల 779 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. దీని విలువ రూ.107 కోట్లు. అయితే, ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ ఇవ్వాలని మూడు మాసాలుగా ఆయా రైస్ మిల్లుల యజమానులకు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ప్రసాద్ 12 సార్లు నోటీసులు జారీ చేశారు. అయినా ఎలాంటి స్పందనా లేకపోవడంతో డీటీసీఎస్ హుజూర్‌నగర్, డీసీఎస్ తహసీల్దార్ గరిడేపల్లి, హైదరాబాద్ ఈటిఎఫ్ బృందం సంతోషిమా,తిరుమల రైస్ కార్పొరేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. అక్కడ నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్‌కు తగ్గ లెక్క సరిపడలేదు. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని వ్యక్తిగతంగా అమ్ముకున్నట్టు తేలింది. దీంతో అధికారులు జిల్లా కలెక్టర్ సూచన మేరకు గరిడేపల్లి, నేరేడుచర్ల మండల పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూర్యాపేట జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ ప్రసాద్ ఫిర్యాదు చేశారు.

# ఆర్టీసీ బస్సులు పెంచాలి

**- బస్ భవన్ వద్ద సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ ధర్నా**

**- ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్‌కు వినతి**

ముషీరాబాద్: ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు పెంచాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని బస్‌భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మునిశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.రమ మాట్లాడుతూ ఉచిత ప్రయాణం బడుగు, బలహీన వర్గాలకు ఉపయోగకరమని, కానీ, బస్సుల సంఖ్యను కుదించడం, కొత్తవి మంజూరు చేయకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఉచిత ప్రయాణం వల్ల కొంత రద్దీ పెరిగిందని, స్త్రీ పురుషుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. స్త్రీలు ఉచితంగా ప్రయాణిస్తున్నట్టు.. పురుషులు డబ్బులతో ప్రయాణిస్తున్నట్టు దెప్పిపొడవడం ఏహ్యాభావంతో చూడటం లాంటివి జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం కొత్త బస్సులను ఏర్పాటు చేయడమే మరిచిందని, దాంతో ప్రభుత్వాన్ని విమర్శించాల్సిన ప్రయాణికులు మహిళలను అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సరైనది కాదన్నారు. చిన్న చంద్రన్న మాట్లాడుతూ.. మహిళలను ఉచితంగా తీసుకుపోతున్నట్టు కొందరు కండక్టర్లు అవమానకరంగా



మాట్లాడటం సరికాదన్నారు. చంద్ర అరుణ మాట్లాడుతూ.. సిబ్బంది తక్కువగా ఉండటం వల్ల కండక్టర్, డ్రైవర్లపై ఒత్తిడి పెరిగిందన్నారు. అందువల్ల సిబ్బందిని కూడా నియమించాలని కోరారు. ఉచిత ప్రయాణం వల్ల ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగిందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఇప్పటికైనా రద్దు చేసిన పాత బస్సులను పునరుద్ధరించాలని, ప్రయాణికులకు అనుగుణంగా బస్సులను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎల్.పద్మ, ఆవుల అశోక్, సి.వైపుల్లయ్య, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.హన్మేష్, టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు స్వరూప, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు అజరు, కెఎస్.ప్రదీప్, పీడీఎస్‌యూ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, ఆజాద్, శిరోమణి, ప్రవీణ్ పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు

**పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ**

**ఆరోగ్యంగా ఉంటేనే సమర్థవంతంగా విధులు నిర్వహించగలుగుతాము**

**ఆరోగ్యమే మహాభాగ్యం ఆరోగ్యాన్నిమించింది మరొకటి లేదు.**

**పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ.**



సిద్ధిపేట పోలీసు కమిషనర్ కార్యాలయ ఆవరణలో ఉచిత మెడికల్ క్యాంప్ ను సిద్దిపేట పట్టణంలో ఉన్న మమత కంటి ఆసుపత్రి, రిచ్ చిల్డ్రన్స్ హాస్పిటల్, శ్రీ మంజునాథ గ్యాస్ట్రో లివర్ మెటర్నటీ హాస్పిటల్ సౌజన్యంతో పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ మెడిజ్ ప్రారంభించారు. వైద్య శిబిరంలో సీపీ బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడు విధినిర్వహణలో ఉండటం వలన తమ ఆరోగ్యం పట్టించుకోకపోవడంతో ఎన్నో రకాల అనారోగ్యాలకు గురవుతున్నారని ఆరోగ్యంపై అవగాహన ఎంతో ముఖ్యమని, సిబ్బంది యొక్క కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు దినచర్య, జీవన విధానం మిగతావారితో పూర్తి భిన్నంగా ఉంటుందని, ఇందుకు గానూ మన ఆరోగ్య పరిరక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకొనక తప్పదని అన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు నడక, వ్యాయామం, యోగ వంటివి మన దినచర్యలో భాగం చేసుకోవాలని. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాధులు ఎంతో వేగంగా విస్తరిస్తున్నాయని వ్యాధుల బారిన పడకుండా బారినపడకుండా ఉండేందుకు తగిన ఆరోగ్య సూచనలు పాటిస్తే ఎంతో మంచిదని మనం తీసుకునే అన్ని రకాల ఆహార పదార్థాలలో కల్తీ ఉంటుందని జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు కొన్ని వ్యాధులకు గతంలో వైద్యం అందుబాటులో ఉండేది కాదని ప్రస్తుత సమాజంలో ఎంతో అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో కలవని ప్రత్యేకంగా మనకు అందుబాటులో గల ఆరోగ్య భద్రత సద్వినియోగం చేసుకోవాలని 40 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరు ప్రతి మూడు నెలలకు ఒకసారైనా మన ఆరోగ్యం కోసం డాక్టర్లను సంప్రదించి మందులు వాడే దానికంటే ముందు జాగ్రత్తలు తీసుకోవడం చాలా మంచిదని సూచించారు. కంటి కంటి పరీక్షలు, చిల్డ్రన్స్ పరీక్షలు గ్యాస్ట్రో లివర్ పరీక్షలు మహిళలకు మెటర్నటీ సమస్యలు పరిశీలించి ప్రాథమిక పరీక్షలు చేయడం జరిగింది. మమతా కంటి ఆసుపత్రి డాక్టర్లు డాక్టర్ వి. సురేష్ రెడ్డి, జి మమతారెడ్డి, రిచ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్స్ యం. రవితేజ గౌడ్, ఏ సంతోష్ కుమార్, శ్రీ మంజునాథ హాస్పిటల్ డాక్టర్స్ పోతుగంటి దుర్గరెడ్డి, రాచకొండ సాయిశ్రీ వైద్య సేవలు అందించిన డాక్టర్లకు, మరియు ముఖ్యంగా వైద్య శిబిరాన్ని నిర్వహించడంలో ఉదారత చూపిన సిద్దిపేట వివిధ ఆసుపత్రుల యాజమాన్యానికి మరియు డాక్టర్లకు కమిషనర్ మేడమ్ గారు కృతజ్ఞతలు తెలిపినారు. పోలీసు అధికారులు సిబ్బంది వారు కుటుంబ సభ్యులు 320 మంది వైద్య పరీక్షలు చేయించుకోవడం జరిగినది. సిబ్బంది ఆరోగ్యం మరియు సంక్షేమం పట్ల సిపి తీసుకుంటున్న శ్రద్ధ విశేషమైనదని, ఉచిత మెడికల్ క్యాంప్ ను ఏర్పాటు చేసినందుకు అధికారులు సిబ్బంది ధన్యవాదాలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ డిసిపి యస్. మల్లారెడ్డి, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసిపి మధు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ధరణి కుమార్, రాజేష్, పూర్ణచందర్, విష్ణు ప్రసాద్, కార్తీక్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్, పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు, కార్యాలయ సిబ్బంది హోంగార్డులు పాల్గొన్నారు.

# హామీలు అమలుచేసే వరకూ పోరాటం

**- వాగ్దానాలు తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం : వైరాలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం**



కొణిజర్ల: ప్రతి సీపీఐ(ఎం) నాయకుడు, కార్యకర్త.. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం సింగరాయపాలెం గ్రామంలో పార్టీ వైరా డివిజన్ మహాసభ సీతారాం ఏచూరి నగర్, సురభి వెంకటేశ్వరావు, లింగారావు ప్రాంగణంలో బుధవారం జరిగింది. మండల నాయకులు తాళ్లపల్లి కృష్ణ, కొండెబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, మచ్చా మణి అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. కష్టాలను ఎదుర్కొని నిలబడే శక్తి కమ్యూనిస్టులకే ఉందని, పదవుల కోసం పాకులాడే చరిత్ర సీపీఐ(ఎం)కు ఎప్పుడూ లేదన్నారు. ఓట్లు, సీట్లు లేకపోయినా లగచర్లలో ఫార్మాసిటీ ప్రాజెక్టును వెనక్కి తిప్పికొట్టిన ఘనత కమ్యూనిస్టులకే దక్కిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి ఏదో సాధించినట్టు కోట్లు ఖర్చుపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది విజయోత్సవ సభలు నిర్వహించి గొప్పలు చెప్పుకోవడం హస్యాస్పదంగా ఉందని అన్నారు. ఎన్నికల హామీలు అమలు చేసే వరకు పోరాడుతూనే ఉంటామని తెలిపారు. మనుధర్మ శాస్త్రం పేరుతో దేశంలో మత విద్వేషాలు పెంచి పైశాచికంగా ఆనందం పొందుతున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ మత రాజకీయలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. దేశంలో కమ్యూనిస్టులు లేకపోతే దేశ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని, అదే కమ్యూనిస్టులు బలపడితే దేశంలో ఉన్న ప్రజలకు చక్కటి విద్య, వైద్యంతోపాటు సమానత్వం, మత ఘర్షణలు లేని దేశం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, పి.సోమయ్య, మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బుగ్గవీటి సరళ, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, బండి రమేష్, సీనియర్ నాయకులు కొప్పుల క్రిష్ణయ్య, మధిర, ఖమ్మం డివిజన్ కార్యదర్శులు ఎం.గోపాల్‌రావు, వై.విక్రమ్, నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీనివాస్ రావు, దొంగల తిరుపతిరావు, మెరుగు సత్యనారాయణ, రమణ, చింత నిప్పు చలపతి, నవీన్‌రెడ్డి, బషీర్, బండారు రమేష్, మాజీ ఎంపీపీలు వడ్లమూడి ఉమారాణి, బొంతు సమత, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు పాల్గొన్నారు.

# లక్కీ భాస్కర్ సినిమా స్టైల్లో రాబరీ

హైదరాబాద్: ఇటీవల విడుదలైన లక్కీ భాస్కర్ సినిమా.. టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారిన విషయం తెలిసిందే. వెంకీ అట్లూరీ డైరెక్షన్‌లో దుల్కర్ సల్మార్ హీరోగా నటించిన లక్కీ భాస్కర్ సినిమాలో.. కొంత మంది బ్యాంకు అధికారులు ఎలా మోసాలకు పాల్పడతారు..? నకిలీ స్టేట్ మెంట్లు, ఫోర్జరీలతో కోట్లకు కోట్లు ఎలా కొల్లగొడతారన్నది కళ్లకు కట్టినట్టుగా చూపించారు. అయితే.. సినిమాలో స్టాక్ మార్కెట్‌ను శాసించే ఓ వ్యక్తి కేంద్రంగా సాగే కథలో.. బ్యాంకు అధికారులంతా ఎలా భాగమై అవినీతికి అలవాటు పడతారనేది చూపించారు. అయితే.. అది కొన్ని నిజమైన సంఘటనలను ఆధారంగా చేసుకుని కల్పిత పాత్రలతో సినిమాగా తెరకెక్కించగా..ఇక్కడ కొందరు బ్యాంకు అధికారులు మాత్రం నిజంగానే అవినీతికి పాల్పడి.. కోట్లకు కోట్లే మింగేశారు. నకిలీ చెక్కులు, ఫోర్జరీలతో ఓ ఎన్నారై ఖాతాను ఖాళీ చేసేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన.. పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసుల కథనం ప్రకారం.. ఆస్ట్రేలియా న్యూసౌత్ వేల్స్, సిడ్నీ క్వాకర్స్ హిల్, లవర్ గ్రోవ్‌డ్రైవ్‌లో నివాసముండే పరితోష్ ఉపాధ్యాయ్‌కు హైదరాబాద్‌లోని బేగంపేట యాక్సిస్ బ్యాంక్‌లో 2017 నుంచి ఖాతా ఉంది. అయితే.. 2024, అక్టోబర్ 21న యాక్సిస్ బ్యాంకు ఖాతాను మూసివేసినట్టుగా మెయిల్ వచ్చింది. ఆ మెయిల్ చూసుకుని పరితోష్ ఒక్కసారిగా షాక్ అయ్యారు. అదేంటని.. చూస్తే తన ఖాతా ఖాళీ అయినట్టు గుర్తించాడు.దీంతో.. బ్యాంకుకు వెళ్లి విచారించగా.. 42 చెక్కులతో డబ్బులు డ్రా చేసినట్టుగా తేలటంతో అసలు విషయం అర్థమైంది. ఎవరో నకిలీ చెక్కులతో, తన సంతకాన్ని ఫోర్జరీ చేసి డబ్బులు దోచుకున్నట్టు పరితోష్ గుర్తించాడు. ఈ విషయంపై బ్యాంకు సీఈవోను సంప్రదించగా.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బాధితుడు వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు ప్రారంభించారు. అయితే.. సదరు బ్యాంకు సీనియర్ పార్టనర్ వెంకటరమణ, ఉద్యోగులైన.. సురేఖ, హరి విజయ్, శ్రీదేవి, రఘుతో కలిసి పరితోష్ ఖాతాలోని డబ్బులను కాజేసేందుకు పథకం రచించారు. పరితోష్ పేరు మీద నకిలీ చెక్కులు తయారు చేసి, దానిపై సంతకాలు ఫోర్జరీ చేసి ఖాతాదారుడికి తెలియకుండానే రూ.6.5 కోట్లు డ్రా చేసుకున్నట్టు తేలింది. అయితే.. ఇది కోర్టు రిఫర్ కేసు అయినా నెల రోజుల వరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించలేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. బ్యాంకుల్లో దాచుకుంటే తమ డబ్బు సురక్షితంగా ఉంటుందని భావిస్తే.. అధికారులు ఇలా చేయటం..అది కూడా ఓ పేరున్న బ్యాంకులోని అధికారులు ఇలా మోసానికి పాల్పడటం ఖాతాదారులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

# లోన్ కోసం 40 వేల రూపాయిల చికెన్ లంచం

రాయ్ పూర్: ఓ బ్యాంక్ మేనేజర్‌కు నాటు కోడి కూర అంటే మహా ఇష్టం. లోన్ ఇస్తానని నమ్మించి ఏకంగా రూ.39 వేల విలువ చేసే నాటు కోళ్లు తినేశాడు. ఆకలితో ఉన్న బకాసురుడి మాదిరి కోళ్లను నమిలేసిన ఆ బ్యాంకు మేనేజర్‌ని తీరా లోన్ గురించి అడగ్గా ప్లేట్ తిప్పేశాడు. దీంతో బాధితుడు లబోదిబోమంటూ నేరుగా పోలీసుల వద్దకు వెళ్లి అసలు విషయం చెప్పడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాస్‌పూర్ జిల్లాలోని మస్తూరి పట్టణంలోరైతు రూపచంద్ మన్హర్‌కు కోళ్ల ఫారమ్ ఉంది. తన వ్యాపారాన్ని మరింత విస్తరించాలని భావించిన రైతు స్థానిక ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్‌ను కలిసి, రూ.12 లక్షల లోన్ అడిగాడు. లోన్ ఇస్తానని చెప్పిన మేనేజర్ తనకు నాటు కోడి కూర అంటే ఇష్టమని, తనకు నాటు కోడి తెచ్చివ్వాలని కోరాడు. లోన్ వస్తదన్న ఆశతో మన్హర్ బ్యాంకు మేనేజర్‌కి రోజూ నాటు కోడి మాంసం తెచ్చివ్వసాగాడు. అలా మొత్తం రూ.39 వేల విలువ చేసే నాటుకోళ్లు మేనేజర్ తినేశాడు. పైగా లోన్ కోసం 10 శాతం కమిషన్ కూడా చెల్లించాడు. లోన్ కావాలంటే ప్రతి శనివారం నాటు కోడి మాంసం కావాలని అడగటం, మరో చోట కోడిని కొని తీసుకురావడం రైతుకు దినచర్యగా మారిపోయింది.అయినా బ్యాంకు మేనేజర్ లోన్ మంజూరు చేయకుండా కాలయాపన చేస్తుండటంతో బ్యాంకు మేనేజర్ తనకు లోన్ ఇవ్వదల్చుకోలేదని భావించి, తనను మోసం చేశాడని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడిపై చర్యలు తీసుకోకపోతే తాను ఎస్‌బీఐ బ్రాంచ్ ముందే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. మేనేజర్‌కు ఇచ్చిన కోళ్ల తాలూకు బిల్లులు కూడా పోలీసులకు చూపాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# దెబ్బకు దిగొచ్చిన కాంట్రాక్టర్లు..

హైదరాబాద్: కేసీఆర్ వల్ల కాలేదు.. అలా చూస్తూ ఉండిపోయాడు.. రేవంత్ హెచ్చరించాడు.. దెబ్బకు దారికొచ్చారు..ఫలితంగా ఈ మార్గం మీదుగా ప్రయాణాలు సాగించే నగరవాసులు నరకం చూడడం.. వీటి గుంతల్లో పడి గాయపడడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇన్నాళ్ల తర్వాత పనులు మొదలు కావడంతో ఈ ప్రాంత ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది.దేశం మొత్తం అభివృద్ధి చెందుతోంది అంటాడు మోడీ. మా పరిపాలన కాలంలో నిర్మాణరంగం కొత్త పుంతలు తొక్కింది అంటాడు నితిన్ గడ్కరీ.. తెలంగాణకు మేం వేల కోట్లు ఇచ్చాం తెలుసా అంటాడు కిషన్ రెడ్డి. వాళ్ల మొహాలు తెల్ల మొహాలు వేసుకునేలాగా ఆ పనులు ఆరు సంవత్సరాలుగా ఎక్కడికక్కడే ఆగిపోయాయి. కెసిఆర్ ఒక్కరోజు కూడా పట్టించుకోలేదు. ఏదో తన నమస్తే తెలంగాణలో కేంద్రాన్ని విమర్శించే సమయం వచ్చినప్పుడు రాసుకుంటూ పోయాడు.ఆ పనులు ముమ్మాటికీ తలవంపులే. ప్రజల ముందు తలవంచుకునే తార్కాణాలే. పైగా ఆ పనులను అప్పగించిన కంపెనీ దివాలా తీసింది. అయినప్పటికీ మన రాజకీయ నాయకులు ఉపేక్షించారు.. నిశ్శబ్దాన్ని ప్రదర్శించారు. చివరికి ఇన్నాళ్లకు కదలిక వచ్చింది. రేవంత్ రెడ్డి చర్నాకోల్ అందుకుని కొట్టేసరికి ఒక్కసారిగా కదలిక వచ్చింది. అఫ్కోర్స్ రాజకీయాలు వేరు, రాజకీయ లక్ష్యాలు వేరు.. అభివృద్ధి అనే మాట వచ్చేసరికి కచ్చితంగా నాయకుడికి ఒక దిశ అంటూ ఉండాలి. ఒక దశలో సాగుతూ ఉండాలి.. గుడ్ ఈ విషయంలో రేవంత్ రెడ్డిని అభినందించాల్సిందే. ఎటొచ్చి ఇది కిషన్ రెడ్డి రాజకీయ జీవితానికి ఇబ్బంది కలిగించే పరిణామం. అయితే దీని వెనుక ఏముందో తెలియదు గానీ.. ఒక ముక్కలో చెప్పాలంటే ఇది పోలవరం ప్రాజెక్టుకు తాత.. నమ్మి ఓట్లు వేసినందుకు జనం అనుభవిస్తున్న ఖర్మ.. అందుకు నిదర్శనమే ఉప్పల్ ? నారపల్లి ఫ్లైఓవర్ పనులు. సరిగా ఆరు సంవత్సరాల క్రితం ఫ్లై ఓవర్ నిర్మించాలని భావించారు. నాడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరి, ఇతర నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ పని కేంద్రం, రాష్ట్ర పరిధిలోది కాబట్టి.. కాంట్రాక్టులు కూడా ఉభయులకు అనుకూలమైన కంపెనీకి ఇచ్చేలాగా ఒప్పందాలు జరిగాయి. గాయత్రి కంపెనీ కాంట్రాక్టు పనులు దక్కించుకుంది. పనులు ప్రారంభించింది. అవి నత్త నడకను సరిపోలాయి. ఆరు సంవత్సరాల్లో 44 శాతం మాత్రమే పనులు పూర్తి చేసింది ఆ కంపెనీ.. 2018 లో 600 కోట్లతో ఈ పనులను అప్పుడు ప్రారంభించారు. పిల్లలు మాత్రమే పూర్తి చేశారు. మొత్తం 147 స్లాబులు వేయాల్సి ఉంది. ఇప్పటివరకు 37 మాత్రమే పూర్తి చేశారు. ఈ ఫ్లైఓవర్ పూర్తికాకపోవడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. ఈ అసంపూర్తి పనులపై భారత రాష్ట్ర సమితి కేంద్రంపై యుద్ధం చేస్తున్నప్పుడు మాత్రమే ప్రస్తావించేది. ఆ తర్వాత సైలెంట్ అయిపోయేది. ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం అప్పుడప్పుడు అలా టచ్ చేసి వదిలేది. ఒక్కరోజు కూడా ఈ పనులపై కేంద్రాన్ని అడగలేదు. నిలదీయలేదు. ఇక తెలంగాణలో ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అరవింద్, సోయం బాపూరావు వంటి వాళ్లు ఒకరోజు కూడా దీనిపై రివ్యూ చేసింది లేదు. జనం బాధలను దృష్టిలో పెట్టుకొని ఈ ఫ్లైఓవర్ కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా రంగంలోకి దిగాల్సి వచ్చింది. దివాలాలో ఉన్న గాయత్రి కంపెనీకి అధికారుల ద్వారా హెచ్చరికలు పంపించారు. పనులు ప్రారంభించక పోతే బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. ఫలితంగా ఆ కంపెనీ దిగివచ్చింది. పనులు ప్రారంభించింద. రోడ్లు భవనాల శాఖ పరిధిలోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు కూడా చేశారు. పనులు నారపల్లి ప్రాంతంలోని సిపిఆర్ఐ దగ్గర మొదలయ్యాయి. ఈ రోడ్డు మీదిగానే ట్రాఫిక్ అనుమతిస్తున్నారు. ఫ్లై ఓవర్ పనులు మొదలుపెట్టారు.. త్వరలోనే ర్యాంపు నిర్మాణం చేసి.. పిల్లర్ల పనులు కూడా చేపడుతారని తెలుస్తోంది.హైదరాబాద్ ? యాదాద్రి ప్రాంతంలో రద్దీ విపరీతంగా ఉంటుంది. అందువల్ల దీనిని తగ్గించడానికి ఉప్పల్ నారపల్లి ఫ్లైఓవర్ నిర్మాణాన్ని అప్పట్లో ప్రతిపాదించారు. ఆరు వర్షల్లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని చేపట్టాలని భావించారు. ఉప్పల్ రింగ్ రోడ్ నుంచి మేడిపల్లి, నాచారం, పీర్జాదిగూడ వరకు ఏకంగా 7 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ ఫ్లైఓవర్ నిర్మిస్తారు. దీనికోసం 600 కోట్లు ఖర్చు అవుతుందని నాటి రోజుల్లో అంచనా వేశారు. ప్రభుత్వం విధించిన నాటి నిబంధనల ప్రకారం 2020 జూలైలోనే దీనిని పూర్తి చేయాలి. అయితే ఈ పనులు దక్కించుకున్న కంపెనీ దివాలా తీయడంతో ఎక్కడికక్కడే నిర్మాణం ఆగిపోయింది. ఆరు సంవత్సరాలుగా పిల్లర్లు అలంకార ప్రయంగా మిగిలిపోయాయి. ఫలితంగా ఈ మార్గం మీదుగా ప్రయాణాలు సాగించే నగరవాసులు నరకం చూడడం.. వీటి గుంతల్లో పడి గాయపడడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇన్నాళ్ల తర్వాత పనులు మొదలు కావడంతో ఈ ప్రాంత ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. అయితే పనులు డెడ్ లైన్ లోపు జరుగుతాయా.. మళ్లీ ఆగుతాయా.. అనేది తేలాల్సి ఉంది.

# మండలంలో వరుస విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్స్ దొంగతనాలు..



**– ఆందోళనలో రైతులు..**

క్రిష్ణా : నారాయణపేట జిల్లా క్రిష్ణా మండలంలోని కుసుముర్తి, తంగడిగి గ్రామాల్లో ఇదే నెల వ్యవధిలో మూడు ట్రాన్స్‌పార్మర్ల నుంచి కాపర్ వైర్‌ల దొంగతనాలతో చుట్టుపక్కల గ్రామాల రైతులల్లో భయాందోళనలకు గురవుతున్నారు. మండలంలోని తంగడిగి గ్రామం రైతు పొలంలో బుధవారం మధ్య రాత్రి రాచన్న గౌడ అనే రైతు పొలంలో దుండగులు ట్రాన్సాఫరంను దొంగలించి దానిలో ఉన్న విలువైన కాపర్ వైర్, ఆయిల్ ను ఎత్తుకెళ్లారు. దీని విలువ దాదాపుగా 2 లక్షల పైగానే ఉండవచ్చని రైతు తెలిపారు. మండలంలో చుట్టుపక్క గ్రామాల్లో జరుగుతున్న వరుస దొంగతనంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పొలంలో నార్లు పోసుకునే సమయంలో ట్రాన్స్ పార్మర్లు చోరీకి గురవుతుండడంతో ఆయా గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలోనూ ఇదే విధంగా చోరీలు జరిగినా దొంగలను ఇప్పటి వరకు పట్టుకోలేదని రైతులు అంటున్నారు. దొంగలు రోజంతా బావుల చుట్టూ తిరుగుతూ ట్రాన్స్‌పార్మర్స్‌ను గమనించి అర్ధరాత్రి వేళల్లో దొంగతనాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా దొంగతనాలు జరిగితే తాము వ్యవసాయం చేయడం కష్టమని వాపోయారు. ఇంకా వారం లోపలనే పరి పొలాల్లో నారు పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాయని, ఈ దొంగతనాలతో పొలాలకు నీరందక తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు అంటున్నారు. పోలీసులు నిఘాను పెంచి దొంగతనాలను నివారించాలని రైతులు కోరుతున్నారు.

# ముహూర్తం... కుదిరినట్టేనా..?

మెదక్: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరలోనే జనంలోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఆయన ముందుగా డిసెంబరు 9వ తేదీ నుంచి జరగనున్న తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా? లేదా? అన్నది మాత్రం సందేహంగా మారింది. కేసీఆర్ కొత్త ప్రభుత్వానికి ఏడాది గడువు ఇవ్వాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావడంతో ఇక అసెంబ్లీ సమావేశాలకు హాజరై కేసీఆర్ రాజకీయాల్లో రీ ఎంట్రీ ఇస్తారా? లేదా? అన్నది గులాబీ పార్టీలో ఆసక్తికరంగా మారింది. అసెంబ్లీ సమావేశాలకు రావాలంటూ కాంగ్రెస్ నేతలు ఛాలెంజ్ ల మీద ఛాలెంజ్ లు విసురుతున్న నేపథ్యంలో ఆయన సభకు వచ్చి తన ప్రసంగాలతో అధికార పార్టీని ఇరుకున పెట్టే అవకాశాలు లేకపోలేదని గులాబీ పార్టీ వర్గాలు తెలిపాయి. సంక్రాంతి తర్వాత జనంలోకి వచ్చి ప్రభుత్వ నిర్ణయాలకు, ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు నిరసనగా పర్యటనలు చేస్తారంటున్నారు.2023 ఎన్నికల ఫలితాలు వస్తుండగానే నేరుగా కారులో ఎర్రవెల్లిలోని ఫాం హౌస్ కు వెళ్లిపోయిన కేసీఆర్ ఇక పెద్దగా ఎక్కడా కనిపించలేదు. తర్వాత బాత్ రూంలో జారిపడి కాలు తుంటె విరగడంతో కొంత కాలం విశ్రాంతి తీసుకున్నారు. తర్వాత కుమార్తె కవిత జైలుకెళ్లడంతో ఇక ఆయన బయటకు రాలేదు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ప్రచారానికి వచ్చినప్పటికీ జీరో రిజల్ట్ రావడంతో ఆ ఎన్నికల ఫలితాల తర్వాత అస్సలు బయటకు రావడం లేదు. పార్టీ నుంచి ముఖ్యమైన నేతలు వెళ్లిపోతున్నా పట్టించుకోవడం లేదు. పెద్దగా ఆయన సీరియస్ గా తీసుకోలేదు. ఇది రాజకీయాల్లో సాధారణమేనని భావించినట్లున్నారు. అందుకే నేతలు వెళ్లిపోకుండా ఎలాంటి హడావిడి చేయలేదు. ఆయనకు రాజకీయాలు కొత్త కాదు. ఎటు పవర్ ఉంటే అటు వైపు వెళ్లేవారు ఎక్కువ మంది ఉంటారన్నది ఆయనకు తెలుసు. అయితే తాను బలంగా నమ్మిన వారు వెళ్లిపోవడాన్ని మాత్రం ఒకింత కేసీఆర్ జీర్ణించుకోలేకపోయారంటున్నారు ముఖ్యంగా కె. కేశవరావు, పోచారం శ్రీనివాసరెడ్డి వంటి నేతలు పార్టీని వీడినప్పుడు కేసీఆర్ ఒకింత బాధపడ్డారని, మిగిలిన వాళ్ల విషయంలో పెద్దగా రెస్పాండ్ కాలేదని గులాబీ పార్టీ నేతలు చెబుతారు. అయినా సరే వారిని ఆగాలని కేసీఆర్ కోరలేదు. పార్టీ బాధ్యతలను కూడా పూర్తిగా కుమారుడు కేటీఆర్ కు అప్పగించారు. ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయం చేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. ఎవరైనా నేతలు కలవాలనుకుంటే కేసీఆర్ తో మాట్లాడాలనుకుంటే ఫాం హౌస్ కు వెళ్లాల్సిందే. అక్కడి నుంచి పిలుపు వస్తే తప్ప నేతలు వెళ్లే అవకాశం లేదు. అందుకే నేతలకు కూడా ఆయన దూరంగా ఉన్నారు. ఆయన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మహబూబ్ నగర్ లోనే ఈ విషయం చెప్పారు. తనను ఓడించినా ఒరిగేదేమీ లేదని, తాను ఫామ్ హౌస్ లో వ్యవసాయం చేసుకుంటానని చెప్పిన కేసీఆర్ అదే మాటకు కట్టుబడి అలాగే ఉంటూ వస్తున్నారు. జిల్లాల పర్యటనలకు కూడా రావడం లేదు. పార్టీ ముఖ్యమైన కార్యక్రమాలను కూడా పట్టించుకోవడం లేదు. అయితే ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కావడంతో కేసీఆర్ త్వరలోనే జనంలోకి వస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.తొలుత డిసెంబరు 9వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరయ్యే అవకాశాలున్నాయని తెలిసింది. ఆయన అసెంబ్లీకి వచ్చి తన గళం వినిపిస్తారంటున్నారు. అసెంబ్లీ సమావేశాలకు కూడా రాకుండా ఫాం హౌస్ కే పరిమితమయ్యారన్న విమర్శల నుంచి బయటపడేందుకు ఆయన సభకు వస్తారని చెబుతున్నారు. ముఖ్యమైన అంశాలపై ఇప్పటికే ఆయన అధ్యయనం చేస్తున్నారని చెబుతున్నారు. తన ప్రసంగాలను సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది.

అయితే ఆయన కేసీఆర్.. చివరి నిమిషంలో మనసు మార్చుకుంటే ఎవరూ ఏమీ చేయలేమన్న కామెంట్స్ కూడా పార్టీ నేతల నుంచి వినిపిస్తున్నాయి. మరోవైపు సంక్రాంతి పండగ తర్వాత పూర్తిగా జనంలో ఉండేలా కేసీఆర్ ప్లాన్ చేసుకుంటున్నారని చెబుతున్నారు. క్యాడర్ లో, లీడర్లలో పూర్తిగా మళ్లీ యాక్టివ్ నెస్ తెచ్చేలా కేసీఆర్ పర్యటనలు సాగనున్నాయని తెలిసింది. ఇందుకోసం వరంగల్ నుంచి ఆయన జిల్లాల సభలకు శ్రీకారం చుడతారని చెబుతున్నారు. మొత్తం మీద కేసీఆర్ రీ ఎంట్రీతో తెలంగాణ రాజకీయాలు మరింత వేడెక్కే అవకాశాలున్నాయి.

# మిడ్ డే మిల్స్ కార్మికుల సమస్యలపై ధర్నా..



వేములవాడ: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ నుండి ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వరకు మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పైన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో మధ్యాహ్న భోజన కార్మికులకు 10,000 వేతనం ఇస్తా అని చెప్పి, అధికారంలోకి వచ్చి సంవత్సరం కాలం గడుస్తున్న నేటి వరకు హామీ నిలబెట్టకపోవడంపై తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్రంలో 54,200 మంది మధ్యాహ్న భోజన కార్మికులు మధ్యన భోజన పథకం పై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల గత 23 సంవత్సరాలు నుండి ప్రభుత్వాలు మారిన సమస్యలు తీరడం లేదు, పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో కాలం వెల్లదిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్లో ఉన్న బిల్లులను చెల్లించాలని, ప్రతినెల 5వ తారీఖు లోపు బిల్లులు చెల్లించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు లక్ష రూపాయల లోపు రుణాలను చెల్లించాలని, నిత్యావసర సరుకులు ప్రభుత్వమే పంపిన చేయాలి అని కోరారు. నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు 18 వేల రూపాయలు కేరళ ప్రభుత్వం 26 వేల రూపాయలు వేతనాన్ని ఇస్తుందని ఆ రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని ఏఐటియుసి పక్షాన డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు 3000 రూపాయల జీతం చెల్లించడం చాలా దుర్మార్గమని అన్నారు. శ్రమకు తగ్గ వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు తెలిపిన అమలు చేయకపోవడం హేయమున చర్య అని అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించిన యెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేస్తామని రాములు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి మీసం లక్ష్మణ్, కె.వి అనసూర్య, బి రెడ్డి, లక్ష్మి, రాజమణి, వెంకట నరసవ, జ్యోతి, మానస, రోజా, లత ,నరసయ్య ,విజయ, మానస, లక్ష్మీనరసవ, లింబవ, రాజవ్వ, సుజాత, తదితరులు ఉన్నారు.

# అలజడి రేపుతున్న పెద్దపులులు.. చిరుత పులులు

అదిలాబాద్: పెద్దపులులు.. చిరుత పులులు.. ఇలా పది పులులు తెలుగు రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాల్లో అలజడి రేపుతున్నాయి. ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. ఒకేసారి ఇన్నిపులులు గ్రామాల్లోకి రావడంతో అటవీ శాఖ అధికారులు కూడా వాటిని పట్టుకుని బంధించేందుకు చేసిన ప్రయత్నాలు మాత్రం ఫలించడం లేదు. కొన్ని చోట్ల పశువులు వాటికి ఆహారంగా మారుతున్నాయి. దీంతో ఇటు ప్రజలకు, అటు అటవీ శాఖ అధికారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పుడు వచ్చిన పులులన్నీమగపులులుగా అటవీశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పులులు ఈ సీజన్ లోనే వందల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చి తమ తోడు కోసం వెతుక్కుంటాయని చెబుతున్నారు. పెద్ద పులులు, చిరుత పులులు అరణ్యాలనువదిలి జనావాసాల్లోకి వస్తున్నాయి. కుమురం భీం జిల్లాలో ఇటిక్యాలపాడులో పెద్దపులి పత్తిచేనులో ఉన్న లక్ష్మిపై పంజా విసిరింది. దీంతో లక్ష్మి మరణించింది. తర్వాత ఆ ప్రాంతంలోనే సురేష్ అనే యువకుడిపై దాడికి దిగింది.అయితే సురేష్ మాత్రం పెద్దపులి దాడికి గురై ప్రాణాపాయంనుంచి తప్పించుకున్నాడు. ఇటిక్యాలపాడులో తిరుగుతున్న పెద్దపులి ఇంతవరకూ అటవీ శాఖ అధికారులు పట్టుకోలేకపోయారు. డ్రోన్ కెమెరాలతో దాని సంచారం తెలుస్తున్నప్పటికీ దానిని బంధించేందుకు చేసిన ప్రయత్నాలు మాత్రం సఫలం కావడం లేదు. ఈ పెద్దపులి మహారాష్ట్ర నుంచి వచ్చిందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ జిల్లాలో కూడా మరో పెద్ద పులి సంచరిస్తుందని అటవీశాఖ అధికారులు గుర్తించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాత్రం హెచ్చరికలు జారీ చేశారు.ఆంధ్రప్రదేశ్ లోనూ పలు చోట్ల చిరుత పులి సంచారం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుంది. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలంలో చిరుత పులి సంచరిస్తుండగా స్థానికులు చూసి వీడియో తీసి అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ చిరుత పులి ఒడిశా అటవీ ప్రాంతం నుంచి వచ్చిందని చెబుతున్నారు. అలాగే అల్లూరి జిల్లాలోనూ మరో పులి సంచరిస్తుంది. వైఎస్ఆర్ జిల్లాలో పులితో పాటు పులిపిల్ల తిరుగుతూ కనిపించిందని స్థానికులు చెబుతున్నారు.తూర్పుగోదావరి జిల్లా పత్తిపాడు మండలంలో పశువులపై దాడి చేసింది. దానినిచిరుత పులిగా పాదముద్రలను చూసి అటవీ శాఖ అధికారులు గుర్తించారు.పశువులపై పడి వాటిని చంపేస్తున్నాయి. ప్రకాశం జిల్లా అర్థవీడు మండలంలోనూ పులి సంచారం ఉందని తేలింది. మేక కోసం వెళ్లిన ఆవును చంపేసిందని స్థానికులు చెబుతున్నారు. అనంతపురం జిల్లా కల్యాణ దుర్గం నియోజకవర్గంలోనూ, నెల్లూరు జిల్లా పెంచలకోన ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తుండటం స్థానికుల కంట పడింది.దీంతో ఆ ప్రాంత ప్రజలు వణికిపోతున్నారు. మగపులులు ఆడపులులతో జత కట్టేందుకు వందల కిలోమీటర్లు దూరం ప్రయాణించి వెతుక్కుంటూ జనావాసాల్లోకి వస్తున్నాయి. ఈ సమయంలో పులి క్రూరంగా ఉంటుందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. సాధారణంగా పులి కాని చిరుత పులి కాని ఒకసారి ఆహారం దొరికితే మరో వారం రోజుల వరకూ దానికి ఆకలి వేయదు. నీటికోసం కూడా పెద్దగా వెతకదన్నది అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు.ఆహారం దొరికినప్పుడు ఒకేసారి ఇరవై కేజీల వరకూ తినడం పులి అలవాట్లలో ఒకటిగా చెబుతున్నారు. వేట చేసి ఆహారాన్ని ఒకసారి పొందిన తర్వాత తిరిగి అది ఆహారం కోసం ప్రయత్నించవని, దాడులు చేయవని అంటున్నారు. మొత్త పది పులులు రెండు తెలుగు రాష్ట్రాల్లో తిరుగుతుండటం అటవీ శాఖ అధికారులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. వారంతా రేయింబవళ్లూ పులులను బంధించడానికి ప్రయత్నిస్తున్నా వీరు ఏర్పాటు చేసిన బోన్లకు చిక్కడం లేదు. దీంతో ప్రజలు పులి ఎప్పుడు దాడి చేస్తుందోనన్నభయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మరి ఇంత పెద్ద సంఖ్యలో ఒకేసారి తెలుగు రాష్ట్రాల్లోని జనావాసాల్లో పులుల సంచారం ఉండటం ఇదే ప్రథమమని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్‌లో పెద్దపులి మరోసారి కలకలం రేపింది. సిర్పూర్ మండలంలోని హుడుకిలిలో ఆవు దూడపై దాడి చేసింది. రైతు దంద్రె రావుజీ తన ఇంటి వద్ద కట్టేసి ఉంచిన దూడపై మంగళవారం వేకువజామున పులిదాడి చేసింది. అరుపులు విన్న స్థానికులు కేకలు వేయడంతో పులి అక్కడ నుంచి సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. పులి వెళ్లిపోయిందని స్పాట్‌కు వచ్చిన చూస్తే లేగదూడ తీవ్ర గాయాలతో పడి ఉంది. పులి దాడిలో గాయపడ్డ లేగదూడ ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోంది. తమ గ్రామంలోకి పెద్దపులి రావడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురవుతు న్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడి పోతున్నారు. ఎటు నుంచి పులి వచ్చి దాడి చేస్తుందో అని కంగారు పడుతున్నారు. పులి దాడి గురించి స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే అటవీ శాఖ అధికారులు అక్కడికి చేరుకొని పులి పాదముద్రలు సేకరించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. పులి వస్తుందని భయపడొద్దని బయటకు వెళ్లాలంటే గుంపులుగా వెళ్లాలంటూ సూచిస్తున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. శబ్దాలు చేస్తూ పనులు చేసుకోవాలన్నారు. సమీప గ్రామాల ప్రజలు ఎవరికైనా పులి కనిపిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. పులికి ఎలాంటి హాని చేయొద్దని అది పెద్ద నేరమని గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. పశువులను పులి చంపిన, దాడి చేసిన వారికి అటవీశాఖ తరఫున పరిహారం అందజేస్తామన్నారు.

# ఘనంగా గీతా జయంతి వేడుకలు..

కోరుట్ల :మండల కేంద్రంలో సరస్వమంది పాఠశాలలో గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగు పండితులు ప్రముఖ విద్యావేత్త, కవి బట్టు హరికృష్ణ, విశ్రాంత కమిషనర్ కుమారస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగ కవి పండితుడు బట్టు హరికృష్ణ మాట్లాడుతూ.. గీత జయంతి విశిష్టతను ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. ఖభగవద్గీతను శ్రీకృష్ణుడు అర్జునునికి హితోపదేశం చేశాడని, కర్మాను సారం బందుపరివార బంధాలను కర్మలో భాగంగా ఏ విధంగా ముందుకు వెళ్లాలి ధర్మానికి అధర్మానికి ఉన్న తేడా వివరించి, విద్యార్థులకు భగవద్గీతపై మక్కువ ఏర్పడేలా ఈ శ్లోకాలు నేర్చుకోవాలని, భవిష్యత్తులో అన్ని భాషలపైన పట్టును సంపాదించి అనర్గళంగా మాట్లాడే శక్తిని పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపు వెంకటేశ్ ప్రబంధ, కార్యదర్శి వనపర్తి చంద్రమోహన్, రమ్యచంద్ర మోహన్ అధ్యాపక బృందం విద్యార్థులు తదితరు లు పాల్గొన్నారు.

# అందుబాటులోకి రానున్న 3 స్కై వాక్స్

హైదరాబాద్: ప్రభుత్వం హైదరాబాద్ సిటీపై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనపై రేవంత్ సర్కారు పట్టుదలగా పనిచేస్తోంది. రోడ్లు, అండర్ పాస్‌లు, స్కైవాక్‌లు నిర్మిస్తున్నారు. తాజాగా నగరంలో మరో 3 స్కైవాక్‌లు నిర్మించాలని అధికారులు ప్లాన్ చేశారు. ఉప్పల్‌లో నిర్మించింది ఉపయోగకరంగా ఉంది.తెలంగాణ రాష్ట్రానికి హైదరాబాద్ నగరం వరం అనే అభిప్రాయం విస్తృతంగా ఉంది. అందుకే ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. హైదరాబాద్ అభివృద్ధిపై స్పెషల్ ఫోకస్ పెడుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. హైదరాబాద్ నగరంలో రోడ్లు, ఫ్లైఓవర్లు, స్కైవాక్‌లు నిర్మించింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ పనులను కొనసాగిస్తోంది. దీంతో హైదరాబాద్ అభివృద్ధి పరుగులు పెడుతోంది.తాజాగా.. హైదరాబాద్ నగరంలో మరో మూడు కొత్త స్కైవాక్‌లను నిర్మించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటికి అనుమతి రాగానే పనులు మొదలుపెట్టనున్నారు. అల్విన్‌కాలనీ చౌరస్తా, మియాపూర్, ఆరాంఘర్ కూడళ్ల కొత్తగా స్కై వాక్‌ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. పరిపాలన అనుమతులు రాగానే ఇక్కడ స్కైవాక్‌లు నిర్మించనున్నారు. హెచ్-సిటీలో భాగంగా ఇప్పటికే ఉప్పల్ కూడలిలో స్కై వాక్ అందుబాటులోకి వచ్చింది. రూ.25 కోట్లత వ్యయంతో రామంతాపూర్ రోడ్డు, నాగోల్, వరంగల్ రోడ్డు, మెట్టుగూడ మార్గాలతోపాటు.. ఉప్పల్ మెట్రోరైలు స్టేషన్‌ను కలుపుతూ ఈ స్కైవాక్ నిర్మించారు. అన్ని వైపులా మెట్లు, లిఫ్టులు ఏర్పాటు చేశారు. రహేజా మైండ్‌స్పేస్ ప్రాంగణంలోనూ ఇలాంటి నిర్మాణం ఉపయోగకరంగా ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. అందుకే మరిన్ని స్కై వాక్‌లు అవసరమని జీహెచ్ఎంసీ ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. హెచ్ సిటీ ప్రాజెక్టు కింద తాజాగా మున్సిపల్ శాఖ రూ.5,942 కోట్ల అంచనా వ్యయంతో 23 పనులు చేపట్టాలని హెచ్ఎండీఏకు పరిపాలన అనుమతి ఇచ్చింది. మొదట 2 కూడళ్ల వద్ద.. గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ కూడలిలో రూ.459 కోట్లతో 2 ఫ్లైఓవర్లు, 2 అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. రూ.158 కోట్లతో విప్రో చౌరస్తాలో ఓ ఫ్లైఓవర్, ఐసీఐసీఐ చౌరస్తాలో అండర్‌పాస్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ నగరాలతో పాటుగా.. కొత్తగా ఫోర్త్ సిటీ నిర్మిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆ దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఫోర్త్ సిటీ విషయంలో రేవంత్ గట్టి లక్ష్యాలను పెట్టుకున్నారు. ఓ ప్రణాళికా బద్ధమైన నగరంగా హైదరాబాద్ ఆధారంగా దాన్ని అభివృద్ధి చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే పలు రంగాల హబ్‌లను అక్కడ ఏర్పాటు చేయాడానికి ప్రతిష్టాత్మక సంస్థలతో చర్చలు జరిపారు.

# టీ20 ఫార్మాట్‌లో ఛాంపియన్స్ ట్రోఫీ..?

**- వచ్చే ఏడాది పాకిస్థాన్‌లో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ**

**- దాయాది దేశంలో పర్యటించేది లేదన్న బీసీసీఐ పీసీబీ ముందు ఐసీసీ హైబ్రిడ్ మోడల్ ప్రతిపాదన**

**- ఇప్పటికీ తన వైఖరిని అధికారికంగా ప్రకటించని పాక్**

**- ఈ నేపథ్యంలో టోర్నీ కోసం ఇప్పటికే భారీగా డబ్బు వెచ్చించిన బ్రాడ్‌కాస్టర్ల ఆందోళన తెరపైకి వన్డే ఫార్మాట్ బదులు టీ20 ఫార్మాట్**




వచ్చే ఏడాది పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. దాయాది దేశానికి తమ జట్టును పంపించేది లేదని ఇప్పటికే బీసీసీఐ తేల్చి చెప్పింది. దాంతో భారత్ లేకుండా టోర్నీ నిర్వహించడం కష్టం కనుక ఐసీసీ హైబ్రిడ్ మోడల్ ప్రతిపాదనను పీసీబీ ముందు ఉంచింది. అయితే, ఈ విషయంలో పాక్ తన వైఖరిని స్పష్టంగా చెప్పడం లేదు. దీంతో టోర్నమెంట్ షెడ్యూల్ విడుదల వాయిదా పడుతూ వస్తోంది.

ఇక టోర్నీ ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 తేదీల మధ్య జరిగే అవకాశం ఉంది. దీంతో ఇంకో 75 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈ నేపథ్యంలో టోర్నమెంట్ కోసం ఇప్పటికే భారీగా డబ్బు వెచ్చించిన బ్రాడ్‌కాస్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికీ షెడ్యూల్ ఖరారు కాకపోవడంతో మార్కెటింగ్ చేసుకోలేకపోతున్నామని వారు వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే షెడ్యూల్ త్వరగా ఖరారు చేయాలని ఐసీసీపై ఒత్తిడి పెరుగుతోంది.

ఇక షెడ్యూల్ ప్రకటన మరింత ఆలస్యమైతే టోర్నీలో భారీ మార్పు జరిగే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. టోర్నీని ముందు అనుకున్నట్లు 50 ఓవర్ల ఫార్మాట్‌లో కాకుండా టీ20 ఫార్మాట్‌లో నిర్వహించే అవకాశం ఉందట. వన్డే ఫార్మాట్‌లో కాకుండా టీ20 ఫార్మాట్‌లో అయితే నష్టం వాటిల్లకుండా ఉంటుందని ప్రసారకర్తలు, కొంతమంది వాటాదారులు ఈ ప్రతిపాదనను తెరపైకి తీసుకొస్తున్నారని సమాచారం. "టోర్నీ నిర్వహణపై అనిశ్చితి ఇలాగే కొనసాగితే టీ20 ఫార్మాట్‌లో మార్చాలని కొంతమంది వాటాదారులు కోరే అవకాశం ఉంది. 50 ఓవర్ల ఫార్మాట్‌కు రానురాను ఆదరణ తగ్గిపోతుండటంతో టోర్నమెంట్‌ను టీ20 ఫార్మాట్‌లోకి మార్చితే వేగంగా, సులభంగా మార్కెటింగ్ చేసుకోవచ్చు" అని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై ఐసీసీ కూడా పునరాలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

# ఫ్యాబ్-4 కాదు.. ఆ కుర్రాడే అత్యుత్తమ ప్లేయర్: రికీ పాంటింగ్

దశాబ్దానికిపైగా సత్తాచాటిన విరాట్ కోహ్లి, కేన్ విలియమ్సన్, జో రూట్, స్టీవ్ స్మిత్‌లను క్రికెట్ ప్రపంచం ఫ్యాబ్-4గా పిలుస్తుంటుంది. అత్యుత్తమ క్రికెటర్ అనే ప్రశ్నకు ఈ నలుగురిలో ఒక్కరి పేరే అత్యధికంగా జవాబుగా వినిపిస్తుంటుంది.

అంతటి రీతిలో క్రికెట్ క్షేత్రంలో ఈ యోధులు సత్తాచాటారు. అయితే ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ రికీ పాంటింగ్ అత్యుత్తమ క్రికెటర్ అంటూ కుర్రాడు పేరు చెప్పాడు. ప్రస్తుతం టెస్టుల్లో అత్యుత్తమ క్రికెటర్ ఇంగ్లండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ అని పాంటింగ్ పేర్కొన్నాడు. ఫ్యాబ్-4 కాకుండా తొలిసారి కొత్త పేరు తెరపైకి వచ్చింది. 25 ఏళ్ల ఇటీవల బ్రూక్ ఇటీవల టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి ఎగబాకాడు. జులై నుంచి టెస్టుల్లో నంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్న జో రూట్‌ను అధిగమించి ఒక్క పాయింట్ ఆధిక్యంతో బ్రూక్ అగ్రస్థానానికి చేరాడు. "ప్రస్తుత టెస్టు బ్యాటర్లలో హ్యారీ బ్రూక్ అత్యుత్తమ ప్లేయర్‌గా భావిస్తున్నా. అతను చక్కని ఇన్నింగ్స్‌లు ఆడుతున్నాడు. సొంతగడ్డతో పాటు విదేశాల్లో గొప్ప ప్రదర్శన చేస్తున్నాడు. అతను సాధించిన ఎనిమిది-తొమ్మిది సెంచరీల్లో విదేశాల్లో ఏడు శతకాలు విదేశాల్లోనే బాదడం విశేషం. అతను పరుగులు సాధించే విధానం, క్లాస్‌ను ఎంతో ఆస్వాదిస్తున్నాను. జనరేషనల్ ప్లేయర్ అయిన అతన్ని గత ఐపీఎల్ వేలంలో దక్కించుకున్నాను. ప్రస్తుత టెస్టు ఫార్మాట్‌లో సత్తాచాటుతున్న బ్రూక్ అన్ని ఫార్మాట్లలోనూ అదరగొట్టగలడు" అని రికీ పాంటింగ్ అన్నాడు.



గత కొంతకాలంగా అద్భుత ఫామ్ కొనసాగిస్తున్న హ్యారీ బ్రూక్ శతకాలు సాధిస్తున్నాడు. 23 టెస్టులు ఆడిన బ్రూక్ 61.62 సగటుతో 2280 పరుగులు చేశాడు. ఎనిమిది సెంచరీలు, 10 హాఫ్ సెంచరీలు సాధించాడు. ఓ డబుల్ సెంచరీ కూడా బాదాడు. ఈ నేపథ్యంలో మాజీ క్రికెటర్ల నుంచి బ్రూక్ ప్రశంసలు అందుకుంటున్నాడు. గత ఐపీఎల్ వేలంలో బ్రూక్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకుంది. అప్పటి ఢిల్లీ కోచ్‌గా పాంటింగ్ ఉన్న సంగతి తెలిసిందే.

# తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా జితేందర్ రెడ్డి

**- నవంబర్ 21న జరిగిన తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికలు**

**- చాముండేశ్వరి నాథ్ పై గెలిచిన జితేందర్ రెడ్డి**

**- ఒలింపిక్ సంఘం సెక్రటరీగా మల్లారెడ్డి విజయం**




తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షుడిగా మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి విజయం సాధించారు. నవంబర్ 21న జరిగిన తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికల్లో అధ్యక్ష పదవి కోసం చాముండేశ్వరి నాథ్, జితేందర్ రెడ్డి పోటీ పడ్డారు. అసోసియేషన్‌లోని మొత్తం 68 మంది సభ్యులకు గాను 59 మంది ఓటు వేశారు.


ఇందులో జితేందర్ రెడ్డికి 43 ఓట్లు వస్తే.. చాముండేశ్వరి నాథ్‌కు కేవలం 9 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో జితేందర్ రెడ్డి 34 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఇక తెలంగాణ ఒలింపిక్ సంఘం సెక్రటరీగా మల్లారెడ్డి గెలుపొందారు.

# కోహ్లీ బలహీనత ఓపెన్ సీక్రెట్ : భారత మాజీ బ్యాటర్

బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో విరాట్ కోహ్లీ అంచనాలకు తగ్గట్లుగా ఆడట్లేదు. పెర్త్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ కొట్టినా, మిగతా మూడు ఇన్నింగ్స్‌ల్లో విఫలమయ్యాడు.

ఆఫ్ స్టంప్ మీద పడిన బంతిని వెంటాడుతూ వికెట్ల వెనుకే క్యాచ్ ఔటవుతున్నాడు. అడిలైడ్ టెస్టులో రెండుసార్లు ఆఫ్‌సైడ్ ఆవల పడే బంతులను వెంటాడి పెవిలియన్‌కు చేరాడు. తొలి ఇన్నింగ్స్‌లో స్టార్క్, రెండో ఇన్నింగ్స్‌లో బోలాండ్ కోహ్లీ బలహీనతను ఉపయోగించుకొని వికెట్ రాబట్టారు. ఈనేపథ్యంలో కోహ్లీ బ్యాటింగ్ తీరు గురించి భారత మాజీ బ్యాటర్ మహ్మద్ కైఫ్ మాట్లాడాడు. ఆఫ్ స్టంప్ మీద బంతులు సంధిస్తే కోహ్లీ ఔటవుతాడని బౌలర్లందరికీ తెలుసని, అది ఓపెన్ సీక్రెట్ అని కైఫ్ పేర్కొన్నాడు. ఆసీస్ బ్యాటర్ ట్రావిస్ హెడ్‌కు కూడా ఈ బలహీనత ఉన్నా భారత బౌలర్లు సరైన వ్యూహం అమలు చేయడం లేదన్నాడు.

'ఏడాదికి రెండు, మూడు టెస్టులు మాత్రమే ఆడే బోలాండ్ లాంటి బౌలర్‌కు కూడా విరాట్ కోహ్లీ ఔటవ్వాలంటే ఎక్కడ బౌలింగ్ చేయాలో బాగా తెలుసు. ఆఫ్ స్టంప్ వెలుపల బంతులేస్తే దాన్ని వెంటాడి స్లిప్‌లో లేదా వికెట్‌కీపర్‌కు క్యాచ్ ఇస్తాడని తెలుసు. ఇది ఓపెన్ సీక్రెట్. కోహ్లీని ఎలా ట్రాప్ చేయాలో బోలాండ్‌కు తెలిసినప్పుడు ట్రావిస్ హెడ్ విషయంలో మన బౌలర్లు ఎందుకు ఇలా చేయడం లేదు. హెడ్ కూడా ఆఫ్ స్టంప్ వెలుపల పడే బంతులను సరిగ్గా ఆడలేడు. ఆ లైన్‌లో మనం ఎందుకు నిలకడగా బౌలింగ్ చేయకూడదు? ప్రతి బ్యాటర్‌కు బలహీనతలు ఉంటాయి. హెడ్ విషయంలో భారత్ ఇదే ప్లాన్‌ను అనుసరించాల్సిన అవసరముంది.




మొదటి బంతి నుంచి అతడిని లక్ష్యంగా చేసుకోవాలి. హెడ్ బలహీనతను ఉపయోగించుకోవడానికి ఒక స్థిరమైన ప్రణాళికను రూపొందించాలి. టీమ్ఇండియా కొన్ని తప్పులు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న ఆసీస్ జట్టు చాలా బలంగా ఉందని నేను అనుకోవడం లేదు. మనం (భారత్) వారంటే భయపడాల్సిన అవసరం లేదు. మొదటి మ్యాచ్‌లో మనం గెలిచాం. ఆస్ట్రేలియా బాగా ఆడింది కాబట్టి రెండో మ్యాచ్‌లో గెలిచింది. ఇప్పుడు సిరీస్ 1-1తో సమంగా ఉంది. భారత జట్టు బలంగా ఉంది. గబ్బా టెస్టులో గెలుస్తాం' అని మహ్మద్ కైఫ్ ఆశాభావం వ్యక్తం చేశాడు. ఆసీస్, భారత్ జట్ల మధ్య మూడో టెస్టు డిసెంబరు 14న ప్రారంభం కానుంది.

# యశస్వి జైస్వాల్ ను వదిలేసి వెళ్లిపోయిన టీమిండియా బస్సు..

**- బోర్డర్-గవాస్కర్ సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో ఉన్న టీమిండియా**

**- ఈ నెల 14 నుంచి బ్రిస్బేన్ వేదికగా మూడో టెస్టు**

**- అడిలైడ్ నుంచి బ్రిస్బేన్ వెళ్లే ముందు షాకింగ్ ఘటన**

**- యశస్వి జైస్వాల్‌ను హోటల్‌లోనే వదిలేసి వెళ్లిపోయిన భారత జట్టు**

**- యువ ఆటగాడు 20 నిమిషాలు ఆలస్యం కావడంతో సారథి రోహిత్ షాకింగ్ నిర్ణయం**

ప్రస్తుతం టీమిండియా బోర్డర్-గవాస్కర్ సిరీస్ కోసం ఆస్ట్రేలియాలో ఉన్న విషయం తెలిసిందే. ఐదు మ్యాచుల ఈ సిరీస్‌లో ఇప్పటికే రెండు టెస్టులు ముగిశాయి. మూడో టెస్టు ఈ నెల 14 నుంచి బ్రిస్బేన్ వేదికగా జరగనుంది. దీనికోసం భారత ఆటగాళ్లు అడిలైడ్ నుంచి బ్రిస్బేన్ వెళ్లారు. అయితే, అడిలైడ్ నుంచి బ్రిస్బేన్ వెళ్లేముందు ఒక షాకింగ్ ఘటన చోటు చేసుకుంది.

స్పోర్ట్స్ టాక్ ప్రకారం.. భారత క్రికెట్ జట్టు బ్రిస్బేన్‌కు బయలుదేరడానికి జట్టు సిద్ధంగా ఉండగా, యశస్వి జైస్వాల్ జట్టు హోటల్ లాబీకి సమయానికి చేరుకోవడంలో విఫలమయ్యాడు. ఫలితంగా అతను లేకుండానే బస్సు విమానాశ్రయానికి వెళ్లిపోయింది. కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ గౌతం గంభీర్ సహా జట్టు మొత్తం అతని కోసం బస్సులో హోటల్ బయట కాసేపు వేచి చూసింది. కానీ కొంత సమయం తర్వాత అక్కడి నుంచి బయలుదేరింది. యువ భారత బ్యాటర్ సుమారు 20 నిమిషాలు ఆలస్యంగా లాబీకి వచ్చాడు. దాంతో విమానాశ్రయానికి ప్రత్యేక కారులో వెళ్లాల్సి వచ్చింది.

భారత క్రికెట్ జట్టు ఉదయం 10 గంటలకు విమానంలో బ్రిస్బేన్‌కు వెళ్లాల్సి ఉంది. దాంతో జట్టు ఉదయం 8:30 గంటలకు హోటల్ నుండి బయలుదేరడానికి సిద్ధమైంది. కానీ జైస్వాల్ సమయానికి రాలేకపోయాడు. యువ ఆటగాడు ఆలస్యం కావడంపట్ల కెప్టెన్ రోహిత్ నిరుత్సాహానికి గురయ్యాడని స్పోర్ట్స్ టాక్ వెల్లడించింది. దాంతో జైస్వాల్‌ను హోటల్‌లోనే వదిలేసి టీమిండియా వెళ్లిపోయింది.




దాదాపు 20 నిమిషాల తర్వాత జైస్వాల్ హోటల్ లాబీకి వచ్చాడు. కానీ, అప్పటికే బస్సు విమానాశ్రయానికి బయలుదేరింది. టీమ్ మేనేజ్‌మెంట్ అతని కోసం కారును ఏర్పాటు చేసింది. ఓ సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్‌తో కలిసి ఆ వాహనంలో ప్రయాణించిన జైస్వాల్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని జట్టుతో కలిశాడు.

ఇక అడిలైడ్ వేదికగా జరిగిన రెండో టెస్టులో భారత్‌పై ఆతిథ్య ఆసీస్ 10 వికెట్ల తేడాతో గెలుపొందిన విషయం తెలిసిందే. అంతకుముందు పెర్త్ లో జరిగిన మొదటి టెస్టులో టీమిండియా 295 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఇప్పుడు ఇరు జట్లు 1-1తో సమంగా ఉన్నాయి.

# బ్రిస్బేన్ టెస్ట్ కోసం వ్యూహం మార్చిన భారత్ !

బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేపట్టి అడిలైడ్ టెస్ట్‌లో చేతులు కాల్చుకొన్న భారత్.. తాజాగా వ్యూహాన్ని మార్చుకొన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి రోహిత్ శర్మ కీలక సంకేతాలు పంపినట్లు ప్రచారం జరుగుతోంది. అతడి స్థానం మరికొంత పైకి జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా నెట్స్ సెషన్‌లో దీనికి సంబంధించిన ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకొన్నాయి.

సాధారణంగా కొత్త బంతిని ఎదుర్కొనేందుకు నెట్స్‌లో ఓపెనర్లు వస్తుంటారు. బ్రిస్బేన్‌లో తాజాగా జరిగిన సెషన్‌లలో రోహిత్ కూడా బంతి మెరుపు కోల్పోని సమయంలోనే సాధన చేశాడు. ఇక బుమ్రా, సిరాజ్ ఆకాశ్‌దీప్‌లు కెప్టెన్‌కు బౌలింగ్ చేశారు. దీంతోపాటు జైస్వాల్, జడేజా వ్యూహాలపై చర్చించాడు. మరోవైపు విరాట్ కూడా ఎక్కువసేపు నెట్స్ సెషన్‌లో పాల్గొన్నాడు.

ఇక ఈ సెషన్స్ మొత్తం తన కోచింగ్ బృందంతో కలిసి గంభీర్ పర్యవేక్షించాడు. విరాట్‌తో ఏదో విషయంలో సుదీర్ఘంగా చర్చించాడు. అనంతరం జట్టు మొత్తం ఫీల్డింగ్ డ్రిల్స్ చేసింది.

రోహిత్ టెస్ట్‌ల్లో బ్యాటింగ్‌కు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నాడు. అతడు గత 12 మ్యాచ్‌ల్లో కేవలం ఒక్క అర్ధశతకం మాత్రమే నమోదు చేశాడు. ఎనిమిది సార్లు పది పరుగుల్లోపే చేశాడు. ఆస్ట్రేలియా సిరీస్ తొలి టెస్ట్‌లో అతడు ఆడలేదు. దీంతో జైస్వాల్, రాహుల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. మ్యాచ్ విజయంలో వీరు కీలక పాత్ర పోషించారు. దీంతో రెండో టెస్ట్‌లో కూడా ఈ జంటను కొనసాగించి.. రోహిత్ 6వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగాడు. కానీ, ఘోరంగా విఫలం అయ్యాడు. అటు రాహుల్ కూడా పెద్దగా పరుగులు సాధించిందేమీ లేదు. దీంతో సీమర్లకు స్వర్గధామమైన గబ్బా మైదానంలో రోహిత్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించవచ్చని ప్రచారం జరుగుతోంది. సీమర్లను ఎదుర్కోవడంలో అతడికి ఉన్న అనుభవం దృష్ట్యా జట్టు ఈ వ్యూహాన్ని అనుసరించే అవకాశం ఉంది. దాదాపు 30 ఏళ్లకుపైగా ఆసీస్‌కు ఓటమి అనేది లేకుండా కొనసాగిన మైదానం గబ్బా. ఈ రికార్డును 2021లో రిషభ్ పంత్ అద్భుతమైన బ్యాటింగ్‌తో బద్ధలు కొట్టిన విషయం తెలిసిందే.




# ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్ విజేత గుకేశ్

సింగపూర్: యువ కెరటం దొమ్మరాజు గుకేశ్ సంచలనం సృష్టించాడు. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో జరిగిన తుది పోరులో విజేతగా నిలిచాడు. గురువారం జరిగిన 14వ రౌండ్‌లో నువ్వా? నేనా? అన్నట్లుగా సాగిన గేమ్‌లో చివరికి విజయం గుకేశ్‌నే వరించింది. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్‌ను సొంతం చేసుకున్న రెండో భారత ఆటగాడిగా గుకేశ్ చరిత్ర సృష్టించాడు. ప్రపంచ చెస్ ఛాంపియన్ అయిన అతిపిన్న వయస్కుడిగా గుకేశ్ రికార్డు సృష్టించాడు. 18 ఏళ్ల వయస్సులో 18వ ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా అవతరించాడు. 2013 తర్వాత ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్న తొలి భారతీయుడు గుకేశ్.ఈ ఎత్తుల రారాజు తమిళనాడు లోని తెలుగు కుటుంబానికి చెందినవాడే. నిజానికి బుధవారమే ఈ ఫలితం తేలాల్సింది. అయితే.. సుమారు 5 గంటలపాటు సాగిన 13వ రౌండ్‌లో ప్రత్యర్థులిద్దరూ పాయింట్‌ను పంచుకున్నారు. విజయం కోసం 18 ఏళ్ల గుకేశ్ గట్టిగానే ప్రయత్నించినా.. ప్రశాంతంగా ఆడిన 32 ఏళ్ల లిరెన్ ఆ అవకాశం ఇవ్వలేదు. దీంతో 68 ఎత్తుల తర్వాత ఇద్దరు ఆటగాళ్లు ఫలితం తేలకుండానే గేమ్ ముగించేందుకు అంగీకరిం చారు. ఇవాళ జరిగిన 14వ రౌండ్‌లో విజయంతో ఒక పాయింట్ సాధించిన గుకేశ్ విజేతగా నిలిచాడు. చెస్ ప్రపంచం దృష్టిలో.. మంచి ఫామ్‌లో ఉన్న 18 ఏళ్ల గుకేశ్ ఫేవరెట్. అతడు.. నెపోమ్నియాషి, కరువానా, నకముర వంటి మేటి గ్రాండ్‌మాస్టర్స్‌ను తోసిరాజని క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలవడం ద్వారా లిరెన్‌తో పోరుకు అర్హత సాధించి, ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన సంగతి తెలిసిందే.

# అరుదైన రికార్డుకు ఒక్క సెంచరీ దూరంలో కోహ్లీ..

ప్రస్తుతం బోర్డర్-గావస్కర్ ట్రోఫీ సిరీస్‌లో విరాట్ కోహ్లీ తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయట్లేదు.

అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకుంటే అతను మాత్రం ఉసురుమనిపిస్తున్నాడు. పెర్త్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ కొట్టినా, మిగతా మూడు ఇన్నింగ్స్‌ల్లో విఫలమయ్యాడు. ఆఫ్ స్టంప్ మీద పడిన బంతిని వెంటాడుతూ వికెట్ల వెనుకే క్యాచ్ ఔటవుతున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై తిరుగులేని రికార్డున్న విరాట్.. ఆ బలహీనతను అధిగమించి మునుపటి ఫామ్‌ను అందుకోవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. 36 ఏళ్ల ఈ స్టార్ బ్యాటర్‌కు బహుశా ఇదే చివరి ఆసీస్ పర్యటన కావొచ్చని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే సచిన్ తెందూల్కర్ కూడా సాధించలేకపోయినా ఓ అరుదైన ప్రపంచ రికార్డు ఇప్పుడు విరాట్‌ను ఊరిస్తోంది. ఇప్పుడు మిస్సయితే మళ్లీ ఆ ఛాన్స్ రాకపోవచ్చు. డిసెంబరు 14 నుంచి గబ్బా వేదికగా ఆసీస్‌తో జరగనున్న మూడో టెస్టు లో కోహ్లీ శతకం బాదితే అద్భుతమైన రికార్డును తన ఖాతాలో వేసుకుంటాడు. ఆస్ట్రేలియాలోని ఐదు ప్రధాన స్టేడియాల్లో సెంచరీలు చేసిన మూడో విదేశీ ఆటగాడిగా నిలుస్తాడు. ఇప్పటివరకు భారత దిగ్గజం సునీల్ గావస్కర్, అలిస్టర్ కుక్ మాత్రమే ఈ ఫీట్ సాధించారు. గావస్కర్ 1977లో బ్రిస్బేన్, పెర్త్, మెల్‌బోర్న్.. 1985లో అడిలైడ్, సిడ్నీలో సెంచరీలు సాధించాడు. ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ అలిస్టర్ కుక్ 2006లో పెర్త్ స్టేడియంలో, 2010-11లో బ్రిస్బేన్, అడిలైడ్, సిడ్నీ మైదానాల్లో శతకాలు బాదాడు. 2017లో కుక్ మెల్‌బోర్న్‌లో మూడంకెల స్కోరందుకుని గావస్కర్ సరసన నిలిచాడు. కోహ్లీ ఇప్పటివరకు టెస్టుల్లో ఏడు శతకాలు బాదాడు. అడిలైడ్‌లో మూడు సెంచరీలు ( 2012లో ఒకటి, 2014లో రెండు), పెర్త్‌లో రెండు సెంచరీలు (2018, 2024), మెల్‌బోర్న్‌లో (2014), సిడ్నీలో (2015)లో ఒక్కో శతకం సాధించాడు. ఒక్కటే ఆడాడు

గబ్బా స్టేడియంలో కోహ్లీ ఇప్పటివరకు ఒక్క టెస్టు మ్యాచ్ మాత్రమే ఆడాడు. ఆ మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన చేయలేదు. తొలి ఇన్నింగ్స్‌లో 19 పరుగులు చేసి హేజిల్‌వుడ్ బౌలింగ్‌లో ఔటయ్యాడు.

రెండో ఇన్నింగ్స్‌లో ఒక్క పరుగుకే మిచెల్ జాన్సన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**